KSR02 B113 C

ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

మార్చి 20, 2016

స్నేహ



జెమినీ మణి

ENTERED



పిచుకమ్మా.. పిచుకమ్మా... ఎక్కడమ్మ?

ఆదిత్య రాయ్‌కపూర్

'స్టార్' వంటకాలు

రుచికరంగా వండడమే కాదు. ఆ వంటవాని పాత్రకు ప్రాణం పోసి మెప్పించడమూ కష్టమే. తెర మీద నలభీమ పాత్రలకీ, పాత్రధారులకీ కొదవే లేదు. నవరసాలు పండించగలమని నిరూపించిన తారలు చెఫ్ అవతారమెత్తి షడ్రుచులను అందిస్తున్నారు. అలా నసీరుద్దీన్ షా 'టుడేస్ స్పెషల్', అమితాబ్ బచ్చన్ 'చీనీ కమ్' సినిమాల్లో చక్కటి నటనను కనబరిస్తే ... షారుక్ 'డూప్లికేట్', సైఫ్ అలీఖాన్ 'సలామ్ నమస్తే', మాధవన్ 'రామ్‌జీ లండన్ వాలే', అక్షయ్ కుమార్ 'చాందినీ చౌక్ టు చైనా' సినిమాల్లో గరిట తిప్పుతూ హాస్యాన్నీ ఒడ్డించారు. వంట పట్ల మాంచి అభిరుచి వున్న ప్రకాష్ రాజ్ 'లవ్‌యు బంగారం'లో అల్జీమర్స్ వ్యాధితో బాధపడే తన భార్య భవానీకి ప్రేమతో వండి తినిపించే భర్త పాత్రలో భలేగా ఇమిడిపోయాడు. 'ఉలవచారు -బిర్యాని'లో హోమ్‌మేకర్‌గానూ రాణించారు. మమ్ముట్టి తనయుడు దుల్కర్ సల్మాన్ 'ఉస్తాద్ హోటల్' చిత్రంలో చెఫ్ పాత్రని అద్భుతంగా పోషించాడు. 'ఆషికి-2' ఫేమ్ ఆదిత్యరాయ్ కపూర్ 'దావతే ఇష్క్', అర్జున్ కపూర్ 'కి అండ్ కా' సినిమాల్లో చెఫ్ పాత్రల కోసం ప్రముఖ వంటగాళ్ల వద్ద పాఠాలు నేర్చుకున్నారట.

ప్రకాష్‌రాజ్



నసీరుద్దీన్

అమితాబ్

మాధవన్

KSR02B113

కన్నయ్య కుమార్ విద్యార్థి నాయకుడు.. భయం లేకుండా బలంగా మాట్లాడే వక్త. మరి ఈ నాయకత్వం, బలం, ధైర్యం ఎవరిచ్చారో తెలుసా? పోరాడే శక్తిని, స్ఫూర్తిని రగిలించిందెవరో తెలుసా? ఆ మార్గదర్శి ఎవరో కాదు తన తల్లే అంటాడు కన్నయ్య. ఆ తల్లీబిడ్డల కథ ఇదే.


కథా నిలయం ENTERED శ్రీకాకుళం

మార్గదర్శి

మార్గదర్శి అమ్మే..

ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయానికి... బీహార్‌లోని బేగుసరాయ్ జిల్లా బీహట్ గ్రామానికి వేలాది మైళ్ల దూరం. ఆ దూరం పేదింట్లో పుట్టిన కన్నయ్యకు... ఓ సైంటిస్ట్‌గా అద్భుతాలు చేయాలనుకున్న అతడి కలలకు కూడా. బీహార్ లెనిన్‌గ్రాడ్‌గా పేరున్న ఆ గ్రామం కమ్యూనిస్టు ఉద్యమాల ఊపిరి. అందులో ఉమ్మడి కుటుంబంలో మూడు కుటుంబాలకు రెండేసి గదులున్న మట్టిరాలుతున్న పెంకుటిల్లు. తన కుటుంబానిదీ కమ్యూనిస్ట్ నేపథ్యం. కన్నీళ్లు, కష్టాలతో కన్నయ్య ఎలాను సాధ్యపడదని సైంటిస్ట్ కలను చిదిమేసుకున్నాడు. కాదు... అతడి పరిస్థితులు చిదిమేశాయి. తండ్రి జైశంకర్ సింగ్‌కి రెండేళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. తల్లి మీనాదేవి మీదనే ఇంటంతటి భారం. అంగన్‌వాడీగా ఇప్పుడు 3 వేల జీతం. ఉన్నత చదువుకు బంగారు గాజులు అమ్మి ఫీజు కట్టుకోమన్న దిక్కు కాదు కదా.. నీకెందుకు రా చదువన్నట్టు కనిపించే బీడు వారిన ఇంటి గోడలు. అయినా బుర్ర వాడి ఉన్నోడు కదా బడిలో చురుకును చూసి వీణ్ని ప్రైవేట్ స్కూల్లో వేస్తే గానీ న్యాయం జరగదన్నారు ఇరుగుపొరుగు. తండ్రి తాహతలేకున్నా కష్టించి ఐదో తరగతిలో వేశాడు. ఆరులో ఓపిక పట్టాడు. ఏడులోకి వచ్చేసరికి ఖర్చు ప్రాణం మీదకు వచ్చింది. కన్నయ్య తిరిగి సర్కార్ బడికి. ఈ రోలర్ కోస్టర్ పసితనంలో ఎంత సంఘర్షణ మిగిల్చిందో డిగ్రీకొచ్చే సరికి సైన్సు నుంచి లిటరేచర్‌కు మనసు మార్చుకున్నాడు. మ్యాక్సీమ్ గోర్కీ నుంచి మున్షీ ప్రేమ్‌చంద్ వరకు చదివేశాడు. కారల్ మార్క్స్‌కు అభిమానైపోయాడు. దుష్యంత్ కుమార్ కవితల్ని కంఠతా పట్టాడు. భారత స్వాతంత్ర్య పోరాటంలో వీధినాటకాలు, కళలతో స్ఫూర్తి రగల్చిన లెఫ్ట్ దళంలోని భారత ప్రజా నాటక మండలికి చెందిన ఇప్పటి కార్యక్రమాలు, నాటకాల్లోను హుషారుగా ఉండేవాడు. ఉద్యమకారుడిగా, విప్లవకారుడిగా జీవితం మలుపు తిరుగుతోంది. పాట్నాలోని గవర్నమెంట్ కామర్స్ కాలేజీలో చేరాక వెంటనే విద్యార్థి రాజకీయాలకు ఆకర్షితుడయ్యాడు. మార్క్సిస్ట్ భావజాలంతో పనిచేసే జట్టులో చేరిపోయాడు. విద్యార్థి సంఘాలు.. ఉద్యమాలు అనగానే చదువును చెట్టెక్కించేస్తారనే వారికి చెంప పెట్టు కన్నయ్య విద్యార్థి జీవితం. కళాశాల చదువుల్లో టాపర్లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్‌ఎస్‌ఎస్) సేవాకార్యక్రమాల్లోను పాలుపంచుకున్నాడు. కేంద్ర ప్రభుత్వం 2007లో నిర్వహించిన ఓ డిబేట్ పోటీలకు బీహార్ విద్యార్థి ప్రతినిధి బృందంలో ఒకడిగాను వెళ్లాడు. పీజీ పూర్తయ్యాక ఉన్నత లక్ష్యాలతో సివిల్స్‌కు ప్రిపేరయ్యాడు. అందుకే 2009లో బీహార్ నుంచి ఢిల్లీకి చేరుకున్నాడు. కానీ మరసటేడాదే సీశాట్ రావడం సివిల్స్ పరీక్షల్లో మార్పులు రావడంతో కన్నయ్యకు మిగతా పేద విద్యార్థుల్లానే ఇబ్బంది ఎదురైంది. మళ్లీ కోచింగ్‌కు పైసా లేదు. తల్లి మీద ఆధారపడలేడు. అందుకే ఏదో ఒక పనిచేసుకుంటూ పైచదువులు కొనసాగిద్దామనుకున్నాడు. అలా జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ప్రవేశ పరీక్ష రాశాడు. టాపర్‌గా నిలిచాడు. బయట ఉద్యోగాలు చేసే క్వాలిఫికేషన్ లేక విశ్వవిద్యాలయాల హాస్టళ్లు పట్టుకు వేలాడుతుంటారని అనే వారికి ఈ పరీక్ష ఫలితం చాలు సమాధానం చెప్పడానికి. అక్కడా మార్క్సిస్ట్ మిత్ర బృందం రెండు చేతులా దగ్గరికి తీసుకోవడం... క్రమంగా విద్యార్థి నేతగా ఎదగడం... పీహెచ్‌డీకి సిద్ధం కావడం జరిగిపోయాయి. ఆఫ్రికన్ స్టడీస్‌లో పరిశోధన సాగిస్తున్న కన్నయ్య విద్యార్థి నేతగా ఉన్నా అంతగా ఎవరికీ తెలీదు. కానీ జేఎన్‌యూ విద్యార్థి ఎన్నికల సందర్భంగా ప్రెసిడెంట్‌గా పోటీ చేసే సమయంలో విద్యార్థులను ఉద్దేశించి ఇచ్చిన ఓ పది నిమిషాల ఉపన్యాసంతో సంఘాలకు అతీతంగా విద్యార్థుల మద్దతు పొందాడు. ఏఐఎస్ఎఫ్ తరపున తొలి ప్రెసిడెంట్‌గా గెలిచాడు. ఆ మధ్య సరిగ్గా అలాంటి ప్రసంగమే చేసి వార్తల్లోకెక్కాడు. ఎంతో వాడిగా, సూటిగా, సునిశితంగా ఉంటాయి అతడి మాటలు. అవే మాటలిప్పుడు జేఎన్‌యూ విద్యార్థుల వాణిగా మారాయి. అతడి గొంతుకకు బలంగా అంతర్జాతీయ విద్యాలయాల నుంచి మద్దతు వచ్చింది. ఇప్పుడు కన్నయ్య బీహట్‌లో పుస్తకాల ఖర్చు గురించి మదనపడ్డ విద్యార్థి కాదు యావత్ అభ్యుదయ విద్యార్థి లోకానికి ప్రతిబింబం. ఈ పోరాట స్ఫూర్తంతా తల్లి నుంచి వచ్చిందే. ప్రతి దశలోను ఆమెది పోరాటమే. పెళ్లై ఇద్దరు బిడ్డల తల్లయ్యాక కూడా చదువును కొనసాగించి ప్లస్‌టూ పూర్తిచేసింది. ఒక వైపు ఇంటి బాధ్యతలు, పిల్లలు, మరో వైపు చదువు.... ఇవే కాక అంతో ఇంతో కుటుంబ పోషణకు సంపాదన. వీటన్నింటినీ బ్యాలెన్స్ చేస్తూ బిడ్డలు గొప్ప కలలు కనేందుకు రోల్‌మోడల్‌గా నిలిచింది. తల్లిదండ్రులిద్దరూ స్థానిక రైతాంగ సమస్యలపై ఉద్యమాల్లో పోరాడినవారే. అందుకే కన్నయ్యకు అమ్మే స్ఫూర్తి, మార్గదర్శి.

✦

ఇండెక్స్

మార్గదర్శి........ 2

మార్గదర్శి అమ్మే

స్టార్.................. 3

జెమినీ మణి

సాహసం.................4

డేర్ డెవిల్ మమ్మీ

కార్టూన్ పంచ్......... 5

స్ఫూర్తి...............10

మహావృక్షాల ప్రియురాలు

తెలుసా...............11

నీటి గలగలలు..

పిచుకమ్మా..
పిచుకమ్మా...ఎక్కడమ్మా..?

అట్టమీది కథ.........6



సందర్భం....12

అవును
వాళ్ళు అడవులను పెంచారు

వింతలోకం...............14

కేశాలతో కోట్

నా కళ్ళతో...............16

నైన్టీస్‌లో టీన్

కవిత్వమ్...............18

కన్నీటి సంకెళ్లు

కథ......................20

కాల్ మనీ

బాలనేస్తాలు.............22

ఎనిమిదేళ్లకే రచయిత్రి

పదవికాసం...............24

సహన శీలులు

ఆస్కార్ విజేత లియోనార్డో నటించిన కొన్ని చిత్రాల్లో అతడు ఎంచుకున్న పాత్రల వైవిధ్యం ఎలా ఉంటుందో నటుడి పరిచయంలో కళ్లకు కట్టినట్టు చూపించారు. తన ఆస్పత్రిలో జన్మనిస్తున్న ఆడపిల్లల తల్లుల పట్ల డాక్టర్ గణేష్ చూపిస్తున్న ఔదార్యం మహా గొప్పది. ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు పొందిన నటి కంగనా రనౌత్ తొలి రోజుల్లో నిలువనీడ లేక నడిరోడ్డు మీదే నిద్రించడం బాధించింది. సంచార జాతికి చెందిన హక్కీ పక్కీ తెగల వారి పేర్లు వారి సంకర భాషా, జీవనశైలి ఆశ్చర్యపరిచాయి. పాకిస్తాన్‌లో సింధ్ ప్రాంతపు మిథీ నగరంలో హిందూ ముస్లిమ్‌లు ఒకే కుటుంబంలోని అన్నదమ్ముల్లా ఒకరినొకరు గౌరవించుకోవడం.. ఇరుమతాల ఉత్సవాలకీ సహకరించి కలిసి జరుపుకోవడం.. ఆ నగర ప్రజల మతసామరస్యానికి చక్కటి ఉదాహరణ.

టి. సత్యనారాయణ మూర్తి, విశాఖ

ఖండాలు దాటిన సైకిల్

బోర్‌కొడితే ఎవరైనా కొంతసేపు వైవిధ్యభరితంగా వుండే ఏదో ఒక పని చేయాలనుకుంటారు. వైద్య వృత్తిలో ఉన్న ఫేబ్స్ అందరికంటే భిన్నంగా సైకిల్‌పై ఖండాలను

చుట్టుముట్టడం, వెళ్లిన ప్రతిచోటా అతనికి ఎదురైన వింత సంఘటనలు ఆశ్చర్యానికి గురిచేశాయి. అట్టమీది కథలో అయ్యారే అసామాన్యులంటూ జీవితంలో ఒడిదొడుకులు ఎదుర్కొంటూ రకరకాల వృత్తుల్లో తమ సత్తా చాటుకున్న మహిళల విషయాలు మార్గదర్శకంగా ఉన్నాయి. తెలుసాలో టెలిఫోన్ వివరాలు, ట్యాక్సీలో వర్ణ చిత్రాల కబుర్లు బాగున్నాయి.

అంబరీష్, కర్నూలు

మనసున్న డాక్టర్

అమ్మాయి పుడితే భారంగా భావించే కొందరిలో మార్పుతెచ్చే విధంగా గొప్పమనసుతో డాక్టర్ గణేష్ అందిస్తున్న సేవలు అందరికీ మార్గదర్శకం కావాలి. లియోనార్డో అవార్డుల పర్వం, అద్దాల నిరసనలు, వింతలోకం ఆద్యంతం చదివించాయి. మామిడి వంటకాలు, పదవికాసం, కంగనా జీవిత సత్యాలు ఆకట్టుకున్నాయి. మూడు పదులు నిండని వయసులో వృత్తిని కూడా విడిచిపెట్టి సైకిల్‌తో ఖండాలని చుట్టడమే కాకుండా అక్కడ ఎదురైన వింత సమస్యలను ధైర్యంతో ఎదుర్కొని తిరిగొచ్చిన ఫేబ్స్ సాహసకారులకు మార్గదర్శి. ప్రపంచమంతా అసహన వాయువులు వీస్తున్నా పాకిస్తాన్‌లోని మితీ పట్టణం మత సామరస్యానికి, సహనానికి ప్రతిబింబంగా నిలిచిన తీరు అభినందనీయం. అడపిల్లలని తెలియగానే గర్భంలో శిశువు ఉసురు తీస్తున్న అత్తలు, భర్త ఆదరణ కరువైన మహిళల వేదనలు... గీత మార్చిన రాత కథలో కళ్లకు కట్టినట్టు వివరించారు.

లక్ష్మీ గీతిక, అనంతపురం

వింత జీవనం

సంచార తెగకి చెందిన హక్కీ పక్కీల పేర్లు వారు మాట్లాడే భాష ఒకింత నవ్వు తెప్పించినా గుర్తింపు లేని జాతిగా వారు సాగిస్తున్న జీవన విధానం కంటతడి పెట్టించింది. లియోనార్డో ఆస్కార్ విశేషాలు, కంగనా రనౌత్ జీవితంలో ఎదుర్కొన్న సమస్యలు ఆద్యంతం చదివించాయి. కార్టూన్ పంచ్, నవ్వుల్ పువ్వుల్ ఎంతగానో నవ్వించాయి. అట్టమీది కథలో మోడల్ పనిమనిషి, జడ్జయిన టీవాలా, బీహార్ రిపోర్టర్ లక్ష్మి విషయాలు ఆకట్టుకున్నాయి. వింతలోకం, 'గీతను మార్చిన రాత' కథ, బుక్‌స్టోర్ నిద్ర, కవిత్వమ్, మితీ సహనం బాగున్నాయి.

-మధుసూదనరావు, కాకినాడ

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ. -520002.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

జెమినీ మణి

జెమినీ సినిమాలో ఏనుగులా, చిట్టి లుకలా మూతి పెట్టి మిమిక్రీ చేసే విలన్ గుర్తున్నాడా. తర్వాత కొన్ని తెలుగు సినిమాల్లో మెరిసిన ఆ నటుడు మళయాళీల ఫేవరెట్ యాక్టర్. కళలన్నీ ఆయనలో భవనం కట్టుకోవడంతో ఆయన్ను కళాభవన్ మణి అని పిలుస్తారేమో. కేవలం నటనే కాదు గాయ కుడిగా, సంగీత దర్శకునిగాను పేరు తెచ్చుకున్నాడు. ఈ మధ్యే చివరి శ్వాస విడిచిన మణికి 45 ఏళ్లే. ఈ అరుదైన నటుడి గురించి కొన్ని సంగతులు..



- మణి అసలు పేరు కున్నిస్సెరి వీట్టిల్ రామన్ మణి. కానీ అతడి స్టేజ్ నేమ్ అయిన కళాభవన్ మణిగానే సుపరిచితుడు.
- కొచ్చిన్ కళాభవన్ డ్రామా ట్రూప్‌లో మిమిక్రీ ఆర్టిస్ట్‌గా పైకెదిగిన మణి మంచి పాటగాడు కూడా.
- తొలిసారి 1995లో 'అక్షరం' అనే మళయాళీ సినిమాలో ఆటోడ్రైవర్ పాత్రలో వెండితెరపై కనిపించాడు. విచిత్రంగా తాను ఒకప్పుడు చాలకుడీలో కొన్నిరోజులు ఆటోడ్రైవర్‌గా పనిచేశాడు.
- 'సల్లాపం' చిత్రంలో నటనతో గుర్తింపు లభించి వెంటవెంటనే హాస్య నటుడిగా క్లిక్ అయ్యాడు.
- తొలుత కొన్ని కమెడియన్ పాత్రలు వేశాక 1999లో లీడ్ రోల్‌లో 'వసంతియుమ్ లక్ష్మీయుమ్ పిన్నె న్హానుమ్' అనే చిత్రంలో నటించాడు. ఆ చిత్రంలో నటనకు గాను అతడికి జాతీయ పురస్కారం (స్పెషల్ జ్యూరీ) వచ్చింది.
- సంగీతంలో మంచి పట్టున్న మణి తొలి ఆల్బమ్ 'కన్నిమంగ ప్రయతిల్'కు మంచి స్పందన దక్కింది.
- జానపద గీతాల ఆల్బమ్స్‌లను ఎన్నింటినో విడుదల చేశాడు. సుమారు 25 చిత్రాల్లోను పాటలు పాడాడు.
- పలు సాంస్కృతిక కార్యక్రమాలు, వేడుకల్లో జానపద పాటల్ని పాడేవాడు. మణికి నటుడిగానే కాకుండా జానపద కళాకారుడిగాను విశేషమైన పేరుంది.
- మణిలోని విలక్షణ నటుడిని గమనించిన దర్శకులు అతడికి డిఫరెంట్ మేనరిజంతో ఉండే విలన్, కేరక్టర్ ఆర్టిస్ట్ పాత్రల్ని ప్రత్యేకించి రూపొందించేవారు.
- మళయాలీ చిత్ర పరిశ్రమతో పాటు తమిళ, తెలుగు ఇండస్ట్రీల్లోను మంచి పేరు తెచ్చుకున్నాడు.
- మళయాలంలో 200 పైచిలుకు సినిమాల్లో నటించిన మణివి తమిళ సినిమాలు కూడా ఎక్కువే.
- పేదల్ని ఆదుకునే మణిని కేరళలో పేదోడి సూపర్‌స్టార్‌గా పిలుస్తారు.
- కమల్ హాసన్‌తో కలిసి పాపనాశనంలో నటించిన మణి విలనీకి కమల్ మెస్మరైజ్ అయ్యారు.
- ఆడుపుల్లియాట్టం, టర్నింగ్ పాయింట్ సినిమాలు చివరివి.

మణి కూతురు శ్రీ లక్ష్మీ కూడా తండ్రిలాగే మిమిక్రీలో దిట్ట.

- కళభవన్ మణి పేదరికంతో ఎన్నో ఇబ్బందులు పడ్డాడు. సినిమాల ద్వారా పైకెదిగిన తర్వాత తన మూలాల్ని ఎప్పుడూ మర్చిపోకుండా చాలక్కుడి బిడ్డలానే తన ఊరివారితో మెలిగేవాడు.
- పది మంది కుటుంబంలో తండ్రి ఒక్కడే భారాన్ని మోస్తున్నాడని గమనించి స్కూల్ చదువయ్యాక ఆటో డ్రైవర్‌గా మారాడు మణి. కళా భవన్ ట్రూప్ వ్యవస్థాపకుడు ఫాదర్ ఏబెల్ మరణించాక ట్రూప్‌లోని కళాకారులు తలో దిక్కు అయ్యారు. అప్పుడు మణి టీవీ సీరియళ్లలో నటించాడు. దూరదర్శన్‌లోని 'వినోదశాల'లో నటిస్తూ సినీ ప్రయత్నాలు మొదలెట్టాడు.
- 2009లో చాలక్కుడిలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థినుల కోసం ఓ బస్‌ను అందించాడు.
- 2011లో కేరళ పెద్ద పండుగైన ఓనమ్‌ను కుటుంబ సభ్యులతో పాటు అతిరాపల్లి వెళ్లి అక్కడి స్థానిక ఆదివాసీలు వేయి మందితో కలిసి జరుపుకున్నాడు. అందరికీ దుస్తులు, విందు ఏర్పాటు చేశాడు.
- క్రితం ఏడాది తన పుట్టిన రోజు వేడుకను వియ్యూర్ కేంద్ర కారాగారంలో ఖైదీలతో జరుపుకున్నాడు. అక్కడ తన పాటల్ని, నటనని ప్రదర్శించాడు.
- కేరళలో మనోరమ అక్షరాస్యత మిషన్‌కు రాయబారిగా పనిచేసిన మణి ఒకప్పుడు పొట్టకూటి కోసం అదే మిషన్‌కు సంబంధించిన ప్రచార కార్యక్రమాల గురించి గోడలపై ప్రకటనలు రాసేవాడిగా పనిచేశాడు.
- మనోరమలో ఐదేళ్ల క్రితం ఓసారి మణి ప్రాంతమైన చాలక్కుడి మార్కెట్ చాలా అపరిశుభ్రంగా ఉందనే వార్త వచ్చింది. అప్పుడా సమయంలో మణి చెన్నైలో బాగా బిజీగా ఉన్నాడు. అయినా సరే సినిమా పనుల్ని పక్కన పెట్టి వెంటనే ఊరొచ్చి తన మిత్రబృందంతో కలిసి మార్కెట్‌నంతా శుభ్రం చేశాడు.
- తన తల్లిని మిగతా వృద్ధుల్లో చూసుకుంటూ తరచూ త్రిస్సూర్‌లోని వృద్ధాశ్రమాలను సందర్శించేవాడు. జాతీయ అవార్డు కన్నా ఆ విషయం తనకు ఎక్కువ అని పలు సందర్భాల్లో చెప్పాడు.
- మణి చనిపోయే నాటికి ఆయన కూతురు పరీక్షలు మొదలయ్యాయి. తండ్రికి చదువంటే చాలా ఇష్టం. ఆ విషయం అర్థం చేసుకున్న మణి కూతురు శ్రీలక్ష్మీ దు:ఖాన్ని దిగమింగుకుంటూనే పరీక్షలకు హాజరైంది.
- ఆస్కార్ అవార్డు గ్రహీత సౌండ్ డిజైనర్ రసూల్ పూకుట్టీ మణి గురించి ప్రస్తావిస్తూ మలయాళీ చిత్రానికి జానపద ధ్వని (ది ఎత్నిక్ సౌండ్ ఆఫ్ మలయాళం సినిమా)అని అన్నాడు. ✦

సాహసం

డేర్ డెవిల్ మమ్మీ

నేలబారున మారథాన్.. కొండల్లో ట్రెకింగ్ తర్వాత వాలైన శిఖరాల్లో పర్వతారోహణ... అదయ్యాక చూపు ఆకాశం వైపు. నేలకు ఊడిపడుతూ స్కై డైవింగ్. కిక్కు తగ్గిందని ఫ్లాగ్ డైవ్‌లు. ప్యారా గ్లైడింగ్‌లు బోర్ కొట్టేశాక ఇక అన్నింటి కంటే ప్రమాదకరమైన బేస్ జంప్‌పై మనసు. 300 జంప్‌ల య్యాక సేద తీరేందుకు సముద్రం లోతుల్లోకి స్కూబా డైవింగ్. ఇది ఓ డేర్ డెవిల్ డైరీలోని పేజీల నిండా సాహసాల చిట్టా. మరి ఈ సాహసాల డైరీని నింపిందెవరో తెలుసా ఇద్దరు బిడ్డల ఓ తల్లి. దేశ తొలి బేస్ జంపర్, స్కూబా మాస్టర్‌గా పేరు దక్కించుకున్న అర్చన సర్దానా ఇవన్నీ నలభయ్యో పడిలో కొనసాగిస్తోంది.

జమ్ములో పుట్టిన అర్చన సర్దానా చిన్నతనం కాశ్మీర్ లోయలోని శ్రీనగర్‌లో సాగిపోయింది. వ్యాపారవేత్తల కుటుంబానికి చెందిన ఆమెను తల్లిదండ్రులు అతిగారాబంగా చూశారు. కనీసం కిలోమీటర్ దూరం నడిచిన సందర్భంగా కూడా లేదు చిన్నతనంలో. ఆ తర్వాత అర్చనకు నేవీ అధికారి కమాండర్ రాజీవ్‌తో వివాహమైంది. పెళ్లయిన 20 రోజులకే ఆమె సాహస క్రీడల ప్రపంచంలో పడిపోయింది. భర్త ప్రోద్భలంతో విశాఖ పట్నంలో నిర్వహించిన వాకథాన్ మారథాన్ ఈవెంట్‌లో పాల్గొంది. 42 కి.మీ. దూరాన్నీ ఛేధించి ఆమె సత్తా చాటింది. అది సాహసంలోని కిక్కేంటో తొలిసారి రుచి చూపింది. అంతే ఇక అర్చన నడకంతా సాహస క్రీడల వైపే సాగింది. ఒక్కో దాన్ని ఎక్స్‌పెరిమెంట్ చేస్తూ అలా డార్జిలింగ్‌లోని హిమాలయన్ మౌంటెనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో భర్తతో కలసి పర్వతారోహణ కోర్సు చేసింది. పర్వతారోహకురాలిగా ఆకాశపు అంచుల్ని తాకొచ్చింది. పారాగ్లైడర్‌గా పక్షులతో మేఘాల్లో స్నేహం చేసింది. కానీ ప్రపంచంలోనే అతి ప్రమాదకరమైన సాహస క్రీడ అయిన బేస్ జంపింగ్ చేయాలంటే మాత్రం ప్రాణాలకు తెగించాల్సిందే. సాహస క్రీడల్లో ఎక్కువ మంది చనిపోయేది దీనిలోనే. దీన్ని 2007లో అర్చన ఒకసారి ప్రయత్నించి వదిలేయలేదు. ఏకంగా ఇప్పటి వరకు 300 పై చిలుకు బేస్ జంప్‌లు చేసి డేర్ డెవిల్స్‌నే ఆలోచనలో పడేసింది. స్కై డైవింగ్‌కు భిన్నంగా ఓ స్థిరమైన కట్టడం నుంచి దూకేయాలి. భూమికి సమీపించే సమయంలో పారాచ్యూట్‌ను విప్పాలి. లేదా వింగ్ స్యూట్‌తో కొంత దూరం గాల్లో ప్రయాణించాలి. భర్త మిత్రుల్లోని కొందరు నేవీ అధికారుల్లో బేస్ జంపర్లున్నారు. తొలుత వారు స్కై డైవింగ్‌పై అర్చనలో ఆసక్తి రేపారు. దీని శిక్షణ కోసం ఆమె అమెరికా వెళ్లి పెర్రీస్ వేలీలో శిక్షణ తీసుకుంది. స్కైడైవింగ్ థ్రిల్ చూశాక ఆమె మనసు బేస్ జంపింగ్‌పై పడింది. సాల్ట్‌లేక్ సిటీలో దీనికి సంబంధించిన మెళకువలు నేర్చుకుంది. ఉటాలో 400 అడుగుల ఎత్తు నుంచి జంప్ చేసింది. ఎన్నిసార్లు చేసినా అడ్రినల్ రష్‌ను ఉన్నపాటున అమాంతం పెంచేసే బేస్ జంపింగ్‌లో ఆమెకు ఓ సారి ప్రమాదం కూడా పలకరించింది. అరిజోనాలో చేసిన ఓ జంప్‌లో ఆమె ప్యారాచ్యూట్ తెరచుకోలేదు. అసలే నేలకు అతి దగ్గర సాగే ఆ జంప్‌లో కొన్ని క్షణాల ఆలస్యమైనా, కొన్ని డిగ్రీల వంపైనా ప్రాణాల్ని గాల్లో పెట్టేస్తాయి. కాసేపటికి చ్యూట్ విచ్చుకోవడంతో ప్రాణాలతో బయటపడింది. కానీ ఇది ఆమెను మరో బేస్ జంప్‌ను చేయకుండా ఆపలేదు. తర్వాత రెండు రోజులకే అదే ప్రదేశానికి వెళ్లి మరో జంప్ చేసి వెక్కిరించి వచ్చింది. మలేషియా ట్విన్ టవర్స్ వద్ద ఇలానే జరిగింది. ఆ సందర్భంలోనైతే నడవలేనంతగా గాయాలయ్యాయి. కానీ తిరిగి రెండు రోజులకే జంప్ చేసి వచ్చింది.

సంద్రంలోకి..

భారత తొలి మహిళా బేస్ జంపర్ అయిన అర్చన మాస్టర్ స్కూబా డైవర్ ట్రైనర్ కూడా. స్కూబా డైవ్‌పై ఆసక్తి కలిగే సమయానికి ఆమెకు కనీసం ఈత కూడా రాదు. నీళ్లంటే భయం. కానీ భర్త ఈ విషయంలో అస్సలు రాజీ పడనన్నాడు. భయంగానే తన ఇద్దరు పిల్లలు ప్రణవ్ (10), ఆయుష్ (8)తో పాటు ఈత నేర్చుకుంది. ఇప్పుడు వాళ్లకు 15, 13 ఏళ్లు. అప్పటికి 40 ఏళ్లు నిండిపోయాయి అర్చనకు. ఒకప్పుడు పైపైన ఈదులాడటానికే బిగుసుకుపోయింది కానీ ఇపుడు ప్రపంచంలోని పలు లోతైన సముద్ర ప్రాంతాల్లో 60 వరకు స్కూబా డైవ్‌లు చేసింది. అర్చన అండమాన్ దీవి సముదాయంలోని నీల్ ద్వీపం వద్ద సముద్రంలో 30 మీటర్ల అడుగున జాతీయ జెండా ఆవిష్కరించి అరుదైన ఫీట్ చేసింది. ఇప్పుడు తన పేరిటే స్కూబా డైవింగ్ అకాడెమీని నడుపుతోంది. చిన్నారులకూ స్కూబా డైవింగ్‌ను పరిచయం చేస్తోంది. మిగతా సాహస క్రీడల్లా కాక స్కూబా ఏకాంతాన్ని, మనశ్శాం తినిస్తుందని చెబుతుంది అర్చన. ఒక్కసారిగా మరో ప్రపంచంలోకి వెళ్లి సేద తీరాలంటే ఇదే సరైనది అంటోంది. సాహస క్రీడల వల్ల కేవలం శరీరానికే కాక మనసుకు, బుద్ధికి ఎంతో ఫిట్‌నెస్ వస్తుందని, అందులో పోరాడే లక్షణాలు నిజ జీవితానికి కూడా అన్వయించుకోవచ్చనేది ఆమె మాట.

ఆమె తన సాహస కార్యాలను సమాజ సేవకు మళ్లిస్తోంది. 'బ్లైండ్ ఫ్రీ ఇండియా' అనే స్వచ్ఛంద సంస్థకు విరాళాలు సేకరించేందుకు హెలీకాప్టర్ నుంచి 'వన్ ఆన్ వన్' జంప్‌ను చేసింది. అదే ఆమె తొలి బేస్ జంప్. ఒకప్పుడు ఇంటి పక్షిగానే ఉండేది. ఇంటీరీయర్ డిజైనర్‌గా పనిచేసేది. కానీ ఇపుడు ఇద్దరు బిడ్డల తల్లయ్యాక కూడా అర్చన అస్సలు అడ్వెంచర్స్‌ను వదలనంటోంది. వీటి కోసం ఏకంగా తన ఇంటినే అమ్మేయాల్సిన పరిస్థితి ఎదురైనా వెనకడుగు వేయలేదు. ఎవరెస్ట్ మీది నుంచి, ఢిల్లీలోని పీతమ్‌పురా నుంచి బేస్ జంప్ చేసేందుకు కసరత్తు చేస్తోంది. శారీరిక కారణాల వల్ల మహిళలు సాహస క్రీడలకు పనికిరారనే మాటల్ని నేలకు విసిరికొట్టాలి, ఎప్పుడు ఇంటికే పరిమితం కాకుండా కనీసం ఔట్ డోర్ క్రీడలైనా ప్రయత్నించాలనేది తోటి మహిళలకు ఆమె సలహా. అప్పుడే తమలోని అసలు శక్తి బయటపడుతుందని, భయాలు తొలగి కొండంత ధైర్యం సర్రున గుండెకు ఎక్కేస్తుందని అంటుంది. ✦





కార్టూన్ - పంచ్

నవ్వుల్ - పువ్వుల్

పెళ్ళికి ముందు తర్వాత

వివాహానికి ముందు ప్రేమికుల సంభాషణ కింది విధంగా ఉన్నది

అతడు: ఈ క్షణం కోసం ఎప్పటి నుంచి ఎదురు చూస్తున్నానో తెలుసా..

ఆమె: నన్ను వదిలి పెట్టి వెళ్ళిపోతావా?

అతడు: కలలో కూడా అలా అనుకోకు.

ఆమె: మన ప్రేమ శాశ్వతం కాదా?

అతడు: అందులో సందేహం ఎందుకు..

ఆమె: నన్ను మోసం చెయ్యవు కదూ?

అతడు: ఛఛా అలాంటిది నా నుండి ఊహించకు.

ఆమె : నన్ను ప్రేమగా దగ్గరకు తీసుకోవాలని ఉందా?

అతడు : ఆ అవకాశం కోసమే ఎదురు చూస్తున్నా.

ఆమె: నన్ను ఎన్నడూ బాధ పెట్టవు కదూ?

అతడు: ఎంత అమాయ కురాలివి

ఆమె: నిన్ను పూర్తిగా నమ్మొచ్చు కదూ?

అతడు: ఊ..

ఆమె: డార్లింగ్....

పెళ్ళి తర్వాత వాళ్ల సంభాషణ ఎలా ఉంటుందో తెలియాలంటే. ఇదే సంభాషణను కింది నుండి పైకి చదివి చూడండి.



టీ టైమ్

కుమార్: మా సెక్రటరీ చాలా సిన్సియర్‌గా పనిచేస్తాడురా. ఎప్పుడు టైమ్ సెన్స్‌ను పాటిస్తాడు.

విమల్: ఎలా చెప్తావురా?

కుమార్: ఆఫీసులో చేరిన రోజు నుంచి ఏ రోజు టీ టైమ్‌ను మిస్ కాలేదురా.



కళ్లకు గంతలు కట్టి అడవిని చూపించమంటే పక్షుల కిలకిలరావాలు, చెట్ల కొమ్మలతో గాలి సయ్యాటల శబ్దం వినిపిస్తే సరి. అడవే కాదు ఒకప్పుడు మన ఊళ్లను ఇలా ఓ శబ్దం పరిచయం చేసేది. పాటలందుకునే పిచ్చుకలు రోజూ మనకు శుభోదయం చెప్పేవి. సాయం వేళయిందని చిర్ప్‌చిర్ప్ మంటూ సూరీడికి మన తరపున టాటాలు, బైబైలు చెప్పేవి. మనిషంటే ఎందుకంత ప్రేమో తెలీదు మన చుట్టూనే మసలుతూ కలివిడిగా తిరిగేవి. దాబాలపైకి చేరో, వాకిట్లో పట్టె మంచం వేసో వెల్లకిలా పడుకుని నారింజ మబ్బుల్లోకి తీక్షణంగా చూస్తుంటే ఇంద్ర ధనస్సులానో, విమానంలానో ఆకృతుల్లో గుంపులుగా విన్యాసాలు చేస్తూ.. వైనాలు పోతూ మన మెప్పు కోసం తెగ పాకులాడేవి. ఇప్పుడవన్నీ ఏమైపోయాయి. వాటిపై మన ప్రేమ ఎక్కడకు ఎగిరిపోయింది. పిచుకమ్మా.. పిచుకమ్మా.. ఎక్కడమ్మా?



పిచుకమ్మా.. పిచుకమ్మా... ఎక్కడమ్మా?

- జి. రవి కిరణ్

సింధు ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అవుతోంది. చదువుకుంటూ కూర్చుంది. ఇంతలో డాడీ ఫోన్ విచిత్రమైన శబ్దం చేసింది. ఏదో మెసేజ్ వచ్చింది. ఆ సౌండ్ చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. తీసి చూసింది. అందులో చిర్ప్ అని ఆ సౌండ్ ఫైల్ ఉంది. మళ్లీ మళ్లీ ప్లే చేసి వింది. బాగుంది. ఇంతలో రవి వచ్చాడు. "డాడీ నీ మెసేజ్ టోన్ బాగుంది. వెరైటీగా ఉంది. ఎవరో చిన్న పిల్లలు ఆడుకుంటుంటే రికార్డ్ చేసి ఉంటారా.. ఎక్కడిదీ సౌండ్" అంటూ ఆసక్తిగా అడిగింది సింధు. రవి నవ్వాడు. "అది చిన్న పిల్లల సౌండ్ కాదు. అది ఓ పక్షి అరుపు" అన్నాడు. "బర్డ్.. ఏ బర్డ్" అడిగింది సింధు. "పిచ్చుకమ్మా.. పిచ్చుక. పిచ్చుక అని చిన్నది ఉంటుంది". "పిచ్చుకా? ఆశ్చర్యంగా అడిగింది. "ఎలా ఉంటుంది". రవికి ఎలా చెప్పాలో అర్థం కాలేదు. "పిచ్చుక అంటే చిన్నది మన అరచేతిలో పట్టేంతే ఉంటుంది. బ్లాకిష్ బ్రౌనిష్ కలర్‌లో కొద్దిగా వైట్ మిక్సింగ్‌తో ఉంటుంది. ఎప్పుడూ చూడలేదా? ఓ నీకు ఇంగ్లీషులో చెప్పాలి కదా. అది స్పారో" అన్నాడు రవి. "స్పారోనా.. అది మాకు చిన్నప్పుడు బర్డ్స్ గురించి చెప్పినప్పుడే ఫోటో చూశాం. కాని నేనెప్పుడూ చూడలేదు. ఫారెస్ట్‌లో ఉంటాయా" అడిగింది సింధు. "ఫారెస్ట్ కాదమ్మా.. మన దగ్గరే ఉంటాయి. నువ్వసలు చూడనే లేదా" ఆలోచనలో పడ్డాడు రవి. "అవును. నిజమే ఏమైపోయాయి. నేను కూడా చూసి చాలా రోజులైంది. ఎప్పుడో చదువుకునే రోజుల్లోనే చూసినట్లు గుర్తు" అన్నాడు ఆలోచిస్తూ ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్లాడు రవి.

తాము చదువుకునే రోజుల్లో అలారం అక్కర్లేదు. వాచీలు అసలే అవసరం లేదు. పొద్దున్నే పక్షులు మేతకు వెళ్లేటప్పుడు అరుస్తూ పోతాయి. అంటే తెల్లవారిందన్నమాట. అదే అలారం. ఇంట్లో పొద్దున్నే పిచ్చుకలు సౌండ్ చేసేవి. అంటే ఆరు అయిందని లేచేవాడు

రవి. వింతగా విజిల్ వేసినట్లు సౌండ్ చేసేవి. కళ్లు తెరవగానే ఎదురుగా పై కప్పులోని చూరు నుంచి పిచ్చుక అప్పుడే బయటికొచ్చి అరుస్తూ ఉండేది. తన తోకను పైకి కిందికి అనుకుంటూ.. ఇక నువ్వు లేస్తే నేనెళతా అన్నట్లు చూసేది. కాసేపటికి ఎగురుకుంటూ వెళ్లిపోయేది. బయటికొచ్చి అరుగు మీద కూర్చుని పళ్లు తోముకుంటుంటే.. పిచ్చుకలు గుంపులు గుంపులుగా ఎగురుతూ వెళుతుండేవి.. ఏదో డ్యూటీ టైమ్ అయిందన్నట్లుగా. ఎంతో ముద్దుగా.. ముచ్చటగా చిన్నగా ఉండేవి. చిన్న శబ్దం అయినా ఉలిక్కిపడేవి. చూరులో వాటి గూడు కూడా విచిత్రంగా ఉండేది. గడ్డిపరకలను ఎలా తెచ్చేవో మరి తెచ్చుకుని గూడులాగా రౌండ్‌గా చేసుకుని పెట్టుకునేవి. తలుపు తీసి లోపలికి వెళ్లినట్లే లోపలికి వెళతాయి. లోపలికి వెళితే కనపడవు. చెట్టు తొర్రలు, పెంకుటిళ్లు అయినా పూరిళ్లు అయినా వాటికి వాడే దుంగలకు ఉండే కన్నాల్లో.. అలా ఎక్కడ కుదిరితే అక్కడ కాపురం పెట్టేసేవి.

అప్పట్లో ఎవరైనా దుబ్బులా జుట్టు పెంచి.. అది నిలబడి ఉంటే.. "ఏంట్రా.. పిచ్చుకగూడులా ఉంది తల. పిచ్చుకొచ్చి దూరేయగలదు. తలపని చేయించరా బాబూ" అనేవారు. అంటే పిచ్చుక గూడు అంత గుబురుగా ఉండేది. ధాన్యపు గింజలు దొరికినవి దొరికినట్లు తినేవి. సాయంత్రం అయిపోగానే అన్నీ ఒకేసారి తిరిగొచ్చేవి. నీళ్లు దొరికితే మాత్రం వదిలేవి కావు. అన్నీ కట్టకట్టుకుని ఒక్కసారే జలకాలాడేవి. మనలా ఎవడి పని వాడు చూసుకోవడం కాకుండా.. అవి మాత్రం ఒక గ్రూపులా వ్యవహరించేవి. కలిసి వెళ్లడం.. కలిసి రావడం.. కలిసి స్నానాలు చేయడం.. ఒక్క గూటిలోకి వెళ్లేటప్పుడు తప్ప.. మిగతా అన్ని సమయాల్లో ఒంటరిగా కనపడేవి కాదు.

పిచ్చుకల్లో కూడా ఆడ, మగ ఉండేవి. ఆడపిచ్చుకలు మన భామల్లాగే అందంగా, లేతరంగుల్లో ముద్దుగా కనపడతాయి. మగపిచ్చుకలు మాత్రం కొంచెం మొరటుగా, ముదురు రంగుల్లో ..మగసచ్చినోడే అని అర్థమైపోయేలాగే ఉంటాయి. సైజులో కూడా రెండిటి మధ్య తేడా ఉంటుంది. మగ పిచ్చుక కాస్త బలంగా, లావుగా కనపడితే.. ఆడపిచ్చుక నాజూకుగా జీరోసైజ్ హీరోయిన్‌లా ఉంటుంది. అవి ఆరు అంగుళాల పొడుగు, మాగ్జిమమ్ 40, 50 గ్రాముల బరువు ఉంటాయంతే. అవి రెండూ కలిసి ఒకే గూటిలో ఉంటాయి. గూటిలో ఏం తంటాలు పడతాయో తెలియదు కాని.. అవి విడాకులు తీసుకున్నట్లు మాత్రం కనపడదు. వాటికి అసలు ఆ ఆలోచనే రాదనుకుంట. అంతగా కలిసిమెలిసి ఉండేవి.

చూరుకు వేలాడే పిచ్చుక గూడు ఎప్పుడైనా



పొరపాటున పడిపోవటమో.. లేదా మన కర్ర తగిలో.. పిల్లలు ఆడుకునేటప్పుడు ఏదైనా తగిలో పడిపోయిందో.. ఇక సాయంత్రం అవి వచ్చాక సీన్ ఎంత బాధాకరంగా ఉంటుందో వర్ణించలేం. అవి వచ్చి గూడు లేకపోయేసరికి ఎప్పుడూ చేసే శబ్దం కాకుండా వేరే రకంగా అరుస్తాయి. అవి వాటి ఏడుపన్న మాట. అలా చాలాసేపు అరుస్తూనే ఉంటాయి. విషయం తెలియనివారికి ఏంటిలా అరుస్తున్నాయి అనుకుంటారు. కాని విషయం తెలిసినవారికి ఆ అరుపులు గుండెల్ని పిండేస్తుంటాయి. అంతలా అవి మొత్తుకునేవి.

దిల్లున్న దిలావర్

పర్యావరణ వేత్తలు మాత్రం మనిషి తలుచుకుంటే పిచ్చుక జాతి అంతాన్ని ఆపొచ్చంటున్నారు. బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ సంస్థను స్థాపించిన దిలావర్ అదే చెబుతున్నాడు. ఎవరీ దిలావర్? మహమ్మద్ దిలావర్. పర్యావరణవేత్త. పదేళ్ల క్రితం పిచ్చుక జాతి సమస్యను అర్థం చేసుకున్నవాడు. పిచ్చుకలకు తానే ఓ ప్రపంచాన్ని సృష్టించి ఇచ్చినవాడు. అవును పిచ్చుకల కోసం వాటి పిచ్చుకగూళ్లలానే తయారు చేసిన వాటిలోనే వాటిని పెట్టి.. వాటికి ఆహారాన్ని, నీళ్లను అందించి బతికిస్తున్నాడు. 2005లో చిన్న ప్రయత్నంలా మొదలెట్టాడు. టైమ్స్ ఆఫ్ ఇండియా ఆ కృషిని గుర్తించి అవార్డు ప్రకటించాక.. దిలావర్‌కు ఫండింగ్ ఇచ్చే సంస్థలు ముందుకొచ్చాయి. దాంతో దిలావర్ పిచ్చుక లోకం మరింత పెరిగింది. ఇలాంటి దిలావర్‌లు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా తయారవుతున్నారు.

పిచ్చుకలు కూడా వలస పక్షులే. కాని అవి ఎక్కువ దూరం ఎగరలేవు. కేవలం కొన్ని కిలోమీటర్లు మాత్రమే అవి వెళ్లగలవు. అందుకే వలస వెళ్లినా ప్రాంతం మారేది కాదు.

కొన్నాళ్లకు పిచ్చుక గూళ్లను పెట్ షాపుల ముందు వేలాడదీసేవారు. వాటి మేతను కూడా అమ్మేవారు. ఇప్పుడు అవి కూడా కనపడటం లేదు. ఎప్పుడో మన పసలపూడి వంశీ తెలుగు సినిమాల్లో చూపించేవారు. ఇప్పుడు చూపించడానికి వంశీకి కూడా ఆ పిచ్చుకలు దొరకవు.

ఇంతకీ ఈ పిచ్చుకలు ఏమైపోయాయి? రవికి అర్థం కాలేదు. ఇన్నాళ్లూ ఎప్పుడూ ఆలోచించలేదు. ఇప్పుడు ఆలోచిస్తుంటే అవి కనపడక చాలా ఏళ్లు అయిపోయిన విషయం అర్థమవుతోంది. "డాడీ ఎక్కడుంటాయి చెప్పు డాడీ" అడుగుతోంది సింధు. ఏం చెప్పాలి? "అదే ఆలోచిస్తున్నాను. అసలు ఎక్కడా లేవే. మే బీ అంతరించిపోయాయేమో" అన్నాడు రవి. "అంటే జురాసిక్ పార్క్‌లోని డైనోసార్‌లాగానా" అడిగింది సింధు. అవునన్నట్లు తలూపాడు రవి.

పిచ్చుకలు అంతరించిపోయాయా? ఏమైపోయాయి? మనుషులు పిచ్చిగడ్డిలా పిచ్చ పిచ్చగా పెరుగుతుంటే.. పిచ్చుకలు మాత్రం ఎందుకు అంతరించిపోతాయి? వాటికి పెద్ద ఫ్లేస్ కూడా అక్కర్లేదే. అసలు పిచ్చుకల లైఫ్ స్టైల్, వాటి చరిత్ర తెలుసుకుంటే.. అవి ఎందుకు అంతరించిపోతాయనేదానికి సమాధానం దొరకొచ్చు.

పిచ్చుకలు మన దగ్గరే కాదు.. ప్రపంచవ్యాప్తంగా ఉంటాయి.. సారీ ఉండేవి. ఎక్కువగా యూరప్, ఆసియా ఖండాల్లో ఉండేవి. అమెరికా, ఆఫ్రికా ఖండాల్లో ఇవి కొన్ని ప్రాంతాల్లోనే

ఉండేవి. జనరల్‌గా ఏ పక్షులైనా అడవుల్లో ఉండటానికి ఇష్టపడతాయి. కాని పిచ్చుకలు మాత్రం మనుషుల మధ్య జీవించడానికే ఇష్టపడతాయి. గతంలో ప్రతి ఇంట్లో ఒకటో రెండో చెట్లు.. పెరడు.. ముందు వసారా ఇలా ఉండేవి. పిచ్చుక గూడు పెట్టుకోవడానికి ఎక్కడో చోట ప్లేస్ దొరికిపోయేది. బయట కూడా బోలెడన్ని చెట్లు ఉండేవి. వాటికి తొర్రలు ఉండేవి. మన ఇళ్లు కూడా అయితే పూరిల్లు, తాటాకు ఇల్లు లేదంటే పెంకుటిల్లు. ఇన్ని ఉన్నా వసారా మాత్రం ఉండేది. చూరుల్లో పిచ్చుకలు గూళ్లు కట్టుకునేవి. లేదంటే ఇళ్లలోనే సపోర్ట్‌గా ఉండే తుమ్మ మొద్దులు వంటి వాటిలో తొర్రలుండేవి. వాటిలో హాయిగా బతికేసేవి.

మన దెబ్బే

మనిషి జీవితం ఎప్పుడైతే అభివృద్ధి వైపు పరుగు పెట్టిందో.. అప్పుడే పిచ్చుక జీవితానికి వినాశన సంకేతాలు మొదలయ్యాయి. పూరిళ్లు, పెంకుటిళ్లు పోయాయి.. డాబా ఇళ్లు వచ్చేశాయి. అన్నీ సిమెంట్ స్లాబ్‌లు.. కాంక్రీట్ పిల్లర్స్. ఇంకా ఆ పిచ్చుకలు గూడు ఎక్కడ కట్టుకుంటాయి. ఇళ్లలో చెట్లు ఎక్కడ కనపడుతున్నాయి. స్థలం ఉంటే మరో రెండు రూములు వేసి అద్దెకిచ్చేయడం అలవాటైపోయింది. అపార్ట్‌మెంట్లు వచ్చేశాయి. ఇంక వసారా ఎక్కడ ఉంటుంది.. పిచ్చుక గూడు ఎందుకుంటుంది. బయట ఉండే చెట్లు కూడా రోడ్ల కోసం కొట్టేశారు. అక్కడా అవకాశం లేదు. పాపం బుజ్జి పిచ్చుక బిత్తరపోయింది ఈ పరిణామాలకు. తానెక్కడ బతకాలో అర్థం కాక గిలగిలలాడి పోయింది. అప్పటికీ పల్లెటూర్లలో ఉండే చెట్లు, పాత ఇళ్లు వంటివాటిని వెతుక్కుని గూడు కట్టుకోగలిగినవి కట్టుకుని బతికాయి. మిగిలినవి గూడు లేక అల్లాడిపోయి.. అంతమైపోయాయి.

ఇంతలోనే వ్యవసాయంలోను, మొక్కల పెంపకంలోను వచ్చిన పెనుమార్పు పిచ్చుకల పాలిట యమపాశంగా మారింది. అదే పురుగుమందుల వాడకం. పెస్టిసైడ్స్. పంటకు పురుగు పట్టకుండా ప్రకృతిపరంగా వాడే సేంద్రీయ పద్ధతి మానేసి.. పెస్టిసైడ్స్ అవే పురుగు మందులు వాడటం మొదలెట్టారు. మొక్కల పెంపకానికి కూడా అవే వాడసాగారు. ఆ పెస్టిసైడ్స్‌లోని ప్రమాదకరమైన రసాయనాలు పిచ్చుకల జీవితాలను హరించేయడం మొదలెట్టాయి. వాటి ఆయుష్షును అవి తగ్గించేశాయి. తిండి కోసం గింజలు, మొక్కల మీదే ఆధారపడ్డ పిచ్చుకలు పాపం తాము విషం తింటున్నామని తెలియక.. అవే తినేవి. తిన్నా తట్టుకోగలిగినవి బతికాయి.. తట్టుకోలేనివి ఈ ప్రపంచానికి సెలవు చెప్పేశాయి. అసలు సమస్య ఏంటంటే అవి పెట్టే గుడ్లు ఎక్కువకాలం ఉండేవి కావు. అంటే మనుషులకు

పిట్ట కథ

- ప్రపంచంలోని చాలా పట్టణ ప్రాంతాల్లో 99 శాతంమేర పిచ్చుకలు అంతరించిపోయాయి.
- సెల్‌ఫోన్ టవర్లు, రసాయన ఎరువులతో పాటు అన్‌లీడెడ్ పెట్రోల్ కూడా పిచ్చుకల ప్రాణాల్ని తీస్తున్న కారణాల్లో ఒకటని కొన్ని అధ్యయనాలు.
- యూరప్, ఆసియాల్లో ఒకప్పుడు ఎక్కువగా కనిపించిన పిచ్చుకల్ని పక్షి ప్రేమికులు కొందరు అమెరికా ఖండాలకు, తూర్పు, దక్షిణ ఆఫ్రికాలకు, ఆస్ట్రేలియా, న్యూజిల్యాండ్‌లకు తీసుకెళ్లారు.
- డీఎన్ఏ పరిశోధనల్లో తేలిన అంశమేమిటంటే 15 శాతం పిట్టలు కాకి లేదా కోడి సంపర్కం ద్వారా పుట్టాయని తేలింది.
- పిచ్చుకలు పరిసరాలతో ఎంత సర్దుకుపోగలవంటే భూమికి 2 వేల అడుగుల లోతున ఓ బొగ్గు గనిలో గూళ్లను పెట్టి పిల్లల్ని పొదిగాయి. కొన్నయితే వదిలేసిన వేర్‌హౌజ్‌ల్లో కాలనీలు పెట్టేశాయి.
- పిచ్చుకలు ఆహారం తీసుకోవడాన్ని త్వరగా నేర్చేసుకుంటాయి. గింజల ఫీడర్ల నుంచి ఆహారాన్ని తీసుకోగలవని 1960లోనే గమనించారు.
- ఏడాదిలో రెండు లేదా మూడు సార్లు గుడ్లను పెడతాయి. 11 రోజుల్లో వాటిని పొదుగుతాయి. ఆ తర్వాత రెండు వారాలకు పిల్లలు సొంత దారి చూసుకుంటాయి.
- ప్రపంచంలో సుమారు 140 రకాల పిచ్చుక జాతులున్నాయి.
- చూడ్డానికే బుల్లిగా ఉండే ఇవి గంటకు 38.5 కి.మీ.ల వేగంతో దూసుకుపోతాయి. అవసరమైతే గంటకు 50 కి.మీ. వేగాన్ని కూడా అందుకోగలవు.
- పిచ్చుకలు నీటి పక్షులు కాకపోయినా ప్రాణం మీదకు వస్తే నీటి లోపలికి దూసుకుపోయి ఈదులాడి పెద్ద పక్షుల దాడి నుంచి తప్పించుకోగలవు.
- పిచ్చుకలు అంతరించిపోవడానికి మరో కారణం వాటి జీవిత కాలం కేవలం 4–5 ఏళ్లే. సంతతికి అవకాశాలు తక్కువ.
- పిచ్చుకలు దాదాపు 830 రకాల ఆహార పదార్థాల్ని తినగలుగుతాయట. అయినా వాటికి తిండి దొరకడం లేదంటే ఆలోచించాల్సిందే.



అబార్షన్ అయినట్లు.. ఆ గుడ్లు మధ్యలోనే చచ్చిపోయేవి. దాంతో పిచ్చుక జాతి అంతానికి పెస్టిసైడ్స్ ఓ కారణంగా మారాయి.

కాస్తో కూస్తో మిగిలిన ఈ పిచ్చుకలపై మరో బ్రహ్మాస్త్రం వచ్చి పడింది. సెల్‌ఫోన్‌లో స్క్రీన్ సేవర్ మీద అందమైన పిచ్చుక బొమ్మ పెట్టుకుంటారు. మెసేజ్ టోన్‌గా పిచ్చుక చేసే శబ్దాన్నే పెట్టుకుని ఆనందిస్తారు. కాని అదే సెల్‌ఫోన్ వాడకం పిచ్చుకలను చంపేసిందంటే నమ్ముతారా? అవును అదే నిజం. సెల్‌ఫోన్ సిగ్నల్స్ కోసం ఏర్పాటు చేసిన సెల్ టవర్స్ వదిలే రేడియేషన్ ఎఫెక్ట్‌కి పిచ్చుకలు పాపం రాలిపోయాయి. మనుషులకే ఆ రేడియేషన్ ఎసరు పెడుతుంటే.. ఇంక చిట్టి ప్రాణం.. ఆ పిచ్చుక మాత్రం ఎలా తట్టుకుంటుంది. రోజురోజుకు సెల్ టవర్స్ సంఖ్య పెరుగుతూ వస్తే... పిచ్చుకల సంఖ్య తరిగిపోతూ వచ్చింది.

ఎవరైనా 70, 80 దశాబ్దాల జనరేషన్ వాళ్లు కలుసుకుంటే.. "ఏరా నువ్వీ మధ్య పిచ్చుకను చూశావా" .. "అవునురా.. పిచ్చుకలు అసలు కనపడటం లేదే" "రేడియేషన్ ఎఫెక్ట్‌కి పోయాయంట" "ఈ డెవలప్‌మెంట్ ఏమో గాని.. చివరకు మనం కూడా లేకుండా పోతామేమో".. ఇవే సంభాషణలు వినపడుతుంటాయి.

పిచ్చుక రోజులు...

పులులు అంతరించిపోతున్నాయి అంటూ పెద్ద పెద్ద ప్రకటనలు ఇచ్చే అటవీశాఖ.. పిచ్చుకల గురించి పట్టించుకోదు. ఎందుకంటే అవి అడవుల్లో ఉండవు కదా. వన్యప్రాణి సంరక్షణ చట్టంలోనూ వీటి గురించి ప్రస్తావన లేదు. ఎందుకంటే ఇవి వన్య ప్రాణులు కాదు కదా. మనుషుల మధ్య బతికే పిచ్చుకలను.. అభివృద్ధి చెందిన మనిషే చంపేస్తున్నాడు. మనిషి సౌకర్యాల కోసం మారిన నాగరికత పిచ్చుకలను నలిపిపారేస్తోంది.

జీవ వైవిధ్యం అంటూ కొన్నేళ్లుగా పర్యావరణవేత్తలు మొదలుపెట్టిన ఉద్యమం కాస్త ఈ పిచ్చుకల గురించి ఆలోచించేలా చేస్తోంది. సృష్టిలో పుట్టిన ప్రతి జీవికి జీవించే హక్కు ఉందని వాదించే వీరు.. పిచ్చుకలు అంతరించిపోకుండా జాగ్రత్తపడాలని చెబుతున్నారు. మనిషి తలుచుకుంటే పిచ్చుకలను బతికించవచ్చని.. అవి బతకడానికి మనిషే అవకాశం ఇవ్వాలని వారంటున్నారు.

ఒక సర్వే ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా పిచ్చుకలు దాదాపు 75 శాతం తగ్గిపోయాయి. ఒక్క మన ఆంధ్రప్రదేశ్‌లోనే 85 శాతం తగ్గిపోయాయట. అంటే ఇక దాదాపు చరిత్రలో, పాఠ్యపుస్తకాల్లో పిచ్చుకను చూసుకోవాల్సిందే తప్పితే.. మనకు ఆ చిట్టి చిట్టి పక్షులు ఇక కనపడవు.

పిచ్చుకల ప్రేమికులు ఇప్పుడిప్పుడే పెరుగుతున్నారు. పిచ్చుక జాతిని కాపాడాలంటే.. దాని ప్రత్యేకతలపై జనంలో అవగాహన పెంచడం కోసం పర్యావరణవేత్తలు ఒక ప్రయత్నం మొదలెట్టారు. ప్రతి సంవత్సరం మార్చి 20న ప్రపంచ పిచ్చుకల దినోత్సవం జరుపుతున్నారు. కనీసం ఈ సందర్భంగా అయినా ప్రజలు పిచ్చుకల గురించి తెలుసుకుంటే.. కోట్లాదిమందిలో కనీసం వందలాదిమంది అయినా ముందుకు వచ్చి పిచ్చుకలను కాపాడతారనేది వారి నమ్మకం.

డాబర్‌మాన్, జర్మన్ షెపార్డ్, బుల్‌డాగ్ అంటూ బలమైన కుక్కలను మాంసం పెట్టి మరీ పెంచే జనం.. పిచ్చుకలను పెంచడం కష్టమేమీ కాదు. వాటికయ్యే ఖర్చులో కనీసం పదవవంతు కూడా కాదు. కేవలం కొన్ని ధాన్యపు గింజలు, నీళ్లు అందిస్తే చాలు పిచ్చుకలు బతికేస్తాయి. అవి ఉండటానికి పిచ్చుకగూడు ఉండాలంతే. మన బాల్కనీల్లోనే పిచ్చుకగూడు ఏర్పాటు చేసి.. వాటిని పెట్టి.. టైమ్‌కి వాటికి ఫుడ్ అందిస్తే.. అవి బతికేస్తాయి. రోజూ మరీ మనకు ఆనందం కలిగించేలా విజిల్ వేస్తూ.. ఆహ్లాదం కలిగిస్తాయి. ఎంచక్కా వాటికి దీపికా పదుకోనే, ప్రియాంక చోప్రా, తమన్నా లేటెస్ట్‌గా మన రకుల్ ప్రీతి సింగ్ వంటి పేర్లు పెట్టుకుని పిలుచుకోవచ్చు.

నెట్‌లో మొత్తం పిచ్చుకల పరిస్థితి అంతా చదివిన నిట్టూర్చాడు. మన అభివృద్ధి వాటి పాలిట నాశనంగా మారిందని రవికి అర్థమైంది. సింధుకి అంతా వివరించాడు. "డాడీ అయితే మనం కూడా పిచ్చుకలను పెంచుదామా. కాని అవి ఎక్కడ దొరుకుతాయి" అడిగింది. "కనుక్కుందాం.. ఎక్కడా దొరక్కపోతే బాంబే దిలావర్ దగ్గరికే పోదాం. తెచ్చుకుందాం" అన్నాడు రవి. ఇద్దరూ కలిసి బాల్కనీలో పిచ్చుకల కోసం ఏర్పాట్లు మొదలెట్టారు.

సో ఫ్రెండ్స్. బారెడు మనిషి చనిపోతే శోకాలు పెట్టే మనం.. పిడికెడంత పిచ్చుక లేకుండా పోతుంటే చూస్తూ ఉండిపోదామా. చిటికెడు ఖర్చుతోనే ఆ పిడికెడంత పిచ్చుకను బతికించేయొచ్చు. పర్యావరణవేత్తల్లా ఉద్యమాలు చేయకపోయినా.. కనీసం మన వంతుగా రెండు పిచ్చుకలను పెంచుదాం. అయితే ఒక కండిషన్.. అందులో ఒకటి ఆడ, ఒకటి మగ ఉండాలి. అలా అయితేనే కదా తర్వాతి తరం మరి. అలా కొందరైనా కదిలితే.. కొన్ని లక్షల పిచ్చుకలు మళ్లీ పుడతాయి. అప్పుడు మనం పిచ్చుక ఎక్కడమ్మా అని అడగ్గానే.. ఇదుగో ఇక్కడేనమ్మా అంటూ మన ముందు ప్రత్యక్షమవుతాయి. ఆ రోజు వస్తుందని ఆశిద్దాం.

గూడు చేస్తే సరి



ఇప్పుడున్న కాంక్రీట్ అరణ్యాల్లో పిచ్చుకలకు గూళ్లు కట్టుకోడానికి సరైన వస్తువులు, చోటు దొరకడం లేదు. ఆ బుల్లి ప్రాణులకు సహాయంగా మీరే చిన్న గూడును ఇంటి వాటర్ ట్యాంక్‌ల దగ్గరో, అపార్ట్‌మెంట్లయితే మెటల్ మెష్‌ల వద్దో, కనీసం కిటికీల దగ్గరో ఏర్పాటు చేయొచ్చు. మార్కెట్‌లో పిచ్చుకల గూళ్లు రెడీమేడ్‌గా దొరికితే సరి లేకుంటే అట్ట బాక్స్‌లనో, థర్మాకోల్ షీట్లనో, చెక్క ప్లాంక్‌లనో పెట్టెలుగాచేసి, మెత్త కోసం వీలుంటే ఎండు గడ్డినో లేదా కాగితం ముక్కలు వగైరాతో పెట్టె లోపల ఉంచొచ్చు. ఓ అడుగు ఎత్తు ఉన్న బాక్స్, దానికో 5 సె.మీ. రంధ్రం 16 చదరపు అంగుళాల స్థలం. ఆకృతి ఓ పోస్ట్ డబ్బాలా వెనుకటి భాగం కాస్త ఎత్తుగా, ముందరి భాగంపై వాలుగా ఉంటే అదే రేకుల షెడ్డులా వర్షం వచ్చినా నీరు లోపలికి చేరదు. వీలుపడితే పుస్తకాల అరల్లా ప్రతి భవనంపై వరసల్ని తయారుచేసి రంధ్రాలుంచితే ఓ జంట మరో జంటకు కబురందించి కాలనీలు పెట్టేస్తాయి. అప్పుడు మీ ఊరిలో మీరో సెలబ్రిటీయే. రానున్నది వేసవి కాలం.. పిచ్చుకలతో పాటు మిగతా పక్షులకు నీటి జాడ దొరకడం కష్టం. అందుకే మీరే ఓ గిన్నెలోనో, కుండ పెంకులోనో, కొబ్బరి చిప్పల్లోనో ఎండకు ఆవిరి అవకుండా నీడపట్టున ఉండే ట్యాంకు చాటునో, డాబా మెట్ల పక్కనో, చెట్ల మీదో ఇలా ఏదైనా పక్షులకు అనుకూలంగా ఉండే ప్రాంతంలో నీటిని రోజూ ఏర్పాటు చేయండి.



చిన్ననాడెపుడో చిటారు కొమ్మన ఎక్కి జాంపండు తెంపిన గురుతులు చాలవు.. ఇప్పుడూ ఓ రావి చెట్టెక్కండి. ప్రకృతిని హత్తుకోండి.. పరవశించండి.. ఆకుల గలగలల్లో సంగీతాన్ని, పసరు వాసనలోని జీవాన్ని, మహా వృక్షంలో సాగిపోతున్న ప్రపంచాల్ని కళ్లప్పగించి చూడండి అంటారు నళినీ నడకర్ణి. కెనోపీల పరిరక్షణ, ప్రకృతి-మనిషి అనుసంధాన కార్యక్రమాలతో ప్రకృతికి అంకితమైన భారత సంతతికి చెందిన అమెరికన్ పర్యావరణ వేత్త ఆమె. ఆరుపదుల్లోను అలవోకగా వందల అడుగుల కెనోపీలపైకెక్కి చిటారు కొమ్మల్ని ముద్దాడే మహావృక్షాల ప్రియురాలామె.

మహావృక్షాల ప్రియురాలు

ఈ భూమ్మీద ఎవరికీ పట్టని ఓ జీవ లోకాన్ని నళినీ తడిమింది. కోస్టారికా నుంచి అమెజాన్ వరకు వర్షారణ్య ప్రాంతాల్లో నింగికి నిచ్చెనేసినట్టుండే మహా వృక్షాల పైభాగంలో ఆ నిశ్శబ్ద లోకం చడీచప్పుడు కాకుండా సాగిపోతోందని గుర్తించింది. భూ జీవ వ్యవస్థ, వాతావరణంపై పెద్ద ప్రభావాన్ని చూపించే వందల అడుగుల ఎత్తుండే మహావృక్షాల అరణ్యాలు.. కెనోపీలే అవి. జనరల్ షెర్మాన్, డగ్లస్ ఫిర్, హైపీరియన్, కోస్ట్ రెడ్‌వుడ్, షాండ్లియర్, టులె, పాండో, మహాబోధి, బ్రిసిల్ పైన్, భావోబాన్ వంటి మహావృక్షాలు వందలాది ఏళ్లపాటు జీవిస్తూ ఓ అద్భుతమైన జీవ వైవిధ్యానికి కేంద్రమయ్యాయి. ఆ మహావృక్షాలపై అరుదైన చీమలు, కీటకాలు, నాచులు, లతలు, తీగలు, పురుగులు, చిన్నచిన్న జంతువులు, పక్షులతో ఓ ప్రత్యేక జీవవ్యవస్థ నడుస్తోందక్కడ. ఓ మహావృక్షాన్ని కలప కోసం నేలకూలిస్తే ఓ జీవజాలం అంతమౌతుంది. ఒకదానికొకటి ఏదో ఒక ప్రయోజనం చేకూరుస్తూ సహజీవనం సాగిస్తున్న ఆ అపూర్వమైన జీవ చక్రం అంతమవుతోందని నళినీ గుర్తించారు. ఓ వైపు కెనోపీల్లో ఎంత విలక్షణమైన జీవ వైవిధ్యం ఉందో పరిశోధిస్తూనే మరో వైపు దాన్నో సామాజిక అంశంగా మలచి ప్రచారాన్ని తీవ్రస్థాయిలోకి తీసుకెళ్లింది. ర్యాప్ సింగర్లను, నృత్యకారిణులను, సంగీత విద్వాంసులను, పాప్ తారలను, రాక్‌స్టార్లను కెనోపీలు ఎక్కించి ప్రత్యేక గీతాలు, నృత్య ప్రదర్శనల్ని మలిపించి జనాల్లోకి తీసుకెళ్లింది. కెనోపి కాన్‌ఫ్లూయెన్స్' (మహావృక్షాల సంగమం) పేరిట విద్యార్థులకు, ఔత్సాహిక పర్యావరణ కార్యకర్తలకు మహా వృక్షాల మధ్యన పాఠాలు చెప్పింది. కాస్కేడ్స్ మౌంటైన్స్ ప్రాంతంలోని 8 వేర్వేరు ప్రదేశాల్లో 'డగ్లస్ ఫిర్' మహావృక్షాల (ఈ జాతి చెట్లు 80-100 మీటర్ల ఎత్తుంటాయి) వద్ద వివిధ కళారూపాల్ని నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తెచ్చింది. గ్రాఫిటీ, ఫ్యాబ్రిక్ పెయింట్లతోను కెనోపీలపై ప్రచారం చేసింది. కెపాసిటర్ గ్రూప్‌తో బయోమ్ పేరిట ఓ ప్రత్యేక నృత్య ప్రదర్శననే రూపొందించింది. చెట్లు కదలవని, జైళ్లలో ఖైదీల జీవితాలూ కదలవనేది ఓ అపోహని ఆ ఇద్దరి బంధనాల్ని తెంపేలా ఓ కొత్త బంధాన్ని కలిపింది. ఖైదీల్ని తన పరిశోధనల్లో భాగస్వాములు చేసింది. మోస్ డేటా కోసం, అంతరించే దశలో ఉన్న కప్పలు ఇతర చిరు జీవాల కాపాడే కార్యక్రమాల్లో వారికి శిక్షణనిచ్చింది. ఇది అద్భుతాలే సృష్టించింది. ఊచలు చూస్తూ, మరింత ఒంటరితనం, కుంగుబాటులోకి జారుకోకుండా ప్రకృతితో కనెక్ట్ చేయడంతో వారిలో మంచి మార్పు వచ్చింది. షెల్టన్‌లోని వాషింగ్టన్ కరెక్షన్ సెంటర్‌లో ఆమె రూపొందించిన 'బ్లూరూమ్' నిండా ప్రకృతి మనోహర దృశ్యాలు, ఆడియోలతో నిండి ఉంటుంది. ఇక్కడ గడిపే ఎంత కరడు గట్టిన నేరస్తుడిలోనైనా మంచి మార్పు వస్తుందని జైలు అధికారులే చెబుతారు.

అధిరోహణ

పర్వతారోహణకు ఉపయోగించే పరికరాలతో 1981లో ఆమె తొలిసారి ఆ వృక్షాల పైభాగానికి చేరుకుంది. తర్వాత 1984లో మరో రెండు పర్యాయాలు అధిరోహించి విలువైన సమాచారాన్ని సేకరించింది. అప్పటివరకు కెనోపీలకు సంబంధించి ఓ డేటాబేస్ అంటూ లేదు. నళినీ ఈ విషయంలో ముందడుగు వేసి ప్రపంచవ్యాప్తంగా ఉన్న కెనోపీల డేటాను సేకరించే ఓ ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. వేలాది చెట్లు కొండ శిఖరాలతో పోటీగా ఎదిగితే సూర్యరశ్మి మృత్తిక నాణ్యత, పోషకాలు ఎలా అంత భారీ వృక్షాలకు వేలాది ఏళ్లుగా అందుతున్నాయనేది ఆమె వేసుకున్న ప్రశ్న. ఆమె పరిశోధనల్లో దీనికి జవాబు దొరికింది. చెట్టు బెరడు జాగ్రత్తగా పరిశీలిస్తే మట్టిని పోలిన పొరలు కనిపించాయి. చెట్టు నుంచి కొన్ని సూక్ష్మమైన వేర్లు లాంటివి పై వరకు ఆ మట్టిని పట్టి ఉంచాయి. గాలిలోని తేమను పీల్చుకుని అవి చెట్టుకు కావాల్సిన నీటిని, కొన్ని రకాల ఎపిఫైట్స్ జీవజాలం ద్వారా పోషకాలను వృక్షాలకు అందిస్తున్నాయనే పరిశోధన ఒక్కసారిగా సంచలనాన్ని సృష్టించింది. ఈ వివరాలతో 'బెట్వీన్ ఎర్త్ అండ్ స్కై' (భూమికి ఆకాశానికి మధ్య) అనే పుస్తకాన్ని రాసింది. తర్వాత 'ది ట్రూత్ అబౌట్ ట్రీస్' అనే డాక్యుమెంటరీకి సహాయాన్నందించింది. మొత్తం 55 శాస్త్రీయ వ్యాసాలను వివిధ సైంటిఫిక్ జర్నల్స్‌కు రాశారు. 1994లో ఇంటర్నేషనల్ కెనోపి నెట్‌వర్క్‌కు రూపకల్పన చేశారు. నళినీ బృందంపై 'హీరోస్ ఆఫ్ ది హై ఫ్రాంటైర్' పేరిట నేషనల్ జాగ్రఫిక్ ఓ డాక్యుమెంటరీని తీస్తే దానికి 2001 ఎమ్మీ అవార్డు దక్కింది. ఆమెను కెనోపీల పరిశోధన రంగంలో ధృవతారగా చూస్తారు. కోస్టారికాతోపాటు పపువా న్యూగినియా, అమెజాన్, పసిఫిక్ వాయువ్య ప్రాంతాల్లోని మహారణ్యాల్లో ఎయిర్ బెలూన్లతోను, పర్వతారోహణ పరికరాలతోను మహావృక్షాలపైకెక్కి పరిశోధనలు కొనసాగిస్తూనే ఉంది. రెండున్నర దశాబ్దాల నళినీ కృషి కెనోపీల విలువను తెలుసుకోవడంతో పాటు వాటి పరిరక్షణకు ప్రపంచం కదిలేలా చేసింది.

- జే

తెలుసా

నీటి గలగలలు....

స్వచ్ఛమైన నీరు భూమి ఉపరితలంపై కంటే భూమి అడుగు భాగంలోనే ఎక్కువ నిల్వ ఉంది.

పెరూలో గాలిలోని తేమ నుంచి నీటిని ఉత్పత్తి చేసేందుకు బిల్‌బోర్డులను ఉపయోగిస్తున్నారు.

మన శరీరంలో ఎముకలు 3 శాతం నీటిని కలిగి ఉంటాయి

ప్రపంచంలోని 90 శాతం మంచి నీరు అంటార్కిటికాలో ఉంది.

టాయిలెట్‌లో ఒక్కో ఫ్లష్‌కి దాదాపు ఆరు లీటర్ల నీరు ఖర్చవుతుంది.

వర్ణ పటంలోని ఎరుపు రంగుని తక్కువగా గ్రహించడం వల్ల నీళ్లు లేత నీలిరంగులో కనిపిస్తాయి.

నీరు చేరుకునే ప్రతి ప్రదేశంలో రసాయనాలు, ఖనిజాలు, పోషకాలను చేరవేస్తుంది.

నీటిని త్వరత్వరగా ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తంలో అధిక నీరు ప్రవేశించి సోడియం స్థాయి తగ్గుతుంది. దీని కారణంగా మెదడు మొద్దు బారినట్టు అనిపిస్తుంది.

భూమ్మీద 97 శాతం ఉప్పునీరే లభిస్తుంది. మిగిలిన నీరు 2.1శాతం ధృవాల వద్ద మంచు గడ్డల రూపంలో ఉంటుంది. మిగతా ఒక శాతం నీటినే మంచి నీరుగా పరిగణిస్తాం.

మనిషి శరీరంలో 60–70 శాతం వరకు నీరుంటుంది. భ్రూణంలో ఇది 95 శాతం వరకు ఉంటుంది.

రష్యాలోని ఒక్క బైకాల్ సరస్సులోనే ప్రపంచంలో 20 శాతం మంచి నీరు గడ్డకట్టిన ఐస్ రూపంలో కాకుండా జలనిధిగా ఉంది.

ఆఫ్రికా, ఆసియా ఖండాల్లోని ప్రజలు ఇప్పటికీ 6 కి.మీ. ప్రయాణించి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

స్వచ్ఛమైన నీటితో విద్యుత్‌ని ఉత్పత్తి చేయలేం అందులో వుండే మలినాలు విద్యుత్‌ని ఉత్పత్తి చేసేందుకు ఉపయోగపడతాయి.

(జల దినోత్సవం సందర్భంగా)



సందర్భం

'మీలో ఎందరు ఏడాదికో మొక్కను నాటుతున్నారు?' అనడిగితే పైకి లేచే చేతులను, వినిపించే స్వరాలను వేళ్ల మీద లెక్కించవచ్చేమో! ప్రకృతి పట్ల... మానవ మనుగడకు కీలకమైన మొక్కల పెంపకం పట్ల మనకున్న శ్రద్ధాసక్తులు అవీ. అయితే జాదవ్ పయాంగ్, అబ్దుల్ కరీమ్, యాకొబా సవడాగో, అవిరమ్ రోజిన్... వంటి కృషీవలులు అడవులను పెంచిన తీరు తెలిస్తే... మనలో ఒక్క రవ్వంత మార్పైనా తెచ్చే అవకాశముంది.

బంజరు భూముల్లో మొక్కలను సాకడానికి ఎన్నో ఎగతాళి మాటలను పడాల్సి వచ్చినా, వ్యంగ్యాస్త్రాలకు లక్ష్యాలైనా లెక్కించక...లక్ష్య సాధనకే కట్టుబడ్డారు ఆ నలుగురు. మార్చి 21వ తేదీ అంతర్జాతీయ అటవీ దినోత్సవం సందర్భంగా... వారు చేసిన కృషి ...

- కె. అంజన

21 March
International Day of Forests

అడవి వీరుడు

జాదవ్ పయాంగ్‌కు అప్పుడు పట్టుమని పదహారేళ్లు కూడా వుండవేమో! ఉత్తర అస్సాంలోని మజూలి వాసి. వరదలొచ్చి ఇళ్లు, వాకిళ్లు కొట్టుకుపోవడంతో స్థానికులు బతుకుతెరువు కోసం పొరుగూళ్లకు వెళ్లిపోయారు. ఇదంతా మానవ జీవితాల్లో ప్రకృతి విలయం సృష్టించిన కల్లోలం. మరి మూగజీవాలకు జరిగిన అన్యాయం మాటో! మనుషులకే దిక్కులేనప్పుడు వాటి గురించి ఎవరు పట్టించుకుంటారు! వరదల్లో కొట్టుకొచ్చిన పాములు, కప్పలు ఇతర ప్రాణుల కళేబరాలు చూసిన ఆ చిన్నారి మనసు మూగబోయింది. ఒంటరిగా కూర్చుని రోదించాడు. అవి ఎందుకు చనిపోవాల్సి వచ్చిందో పొరుగూరి మాష్టారి ద్వారా తెలుసుకుని పరిష్కారం కోసం పరితపించిందా పసి హృదయం. కనుచూపు మేర ఎక్కడా పచ్చటి చెట్టు లేకపోవడం వల్లే అన్ని మూగ ప్రాణులు బలయ్యాయని... తొలిసారిగా 1979లో మొక్కను నాటాడు. అలా ప్రారంభమై అది మహాయజ్ఞంగా మారుతుందని అతను కూడా ఊహించలేదు. ఇప్పుడతనికి 47 సంవత్సరాలు. ముప్పయ్యేళ్లు శ్రమించి ... ఒంటరిగా 1,360 ఎకరాల అడవిని పెంచాడు. పలు రకాల చీమలను సైతం అక్కడికి చేరవేశాడు. అంతరించిపోతున్న ఎన్నో రకాల జంతువులకు ఆలవాలమైంది. రకరకాల పక్షులు, పులులు, ఏనుగులు, ఖడ్గమృగాలు, జింకలు, కీటకాలు, సరీసృపాలు, వేలాది వృక్షాలు, తీగ మొక్కలతో ప్రకృతిమాత పరవశించిపోతోందక్కడ. కుటుంబ సమేతంగా అడవి తల్లి ఒడిలో



సేద తీరడమంటే జాదవ్‌కు మహా ఇష్టం. తన చేతుల మీదగా పెరిగిన అడవిలో దొరికే వాటితోనే వంట చేసుకొంటూ... ఒక చిన్న పూరిపాకలో భార్యాబిడ్డలతో నివసిస్తున్నాడు. అతను కేవలం బుడ్డి వెలిగించడానికి కిరోసిన్, బియ్యం, ఉప్పు మాత్రమే మార్కెట్ నుంచి తెచ్చుకుంటాడు. మిగతావన్నీ అడవి తల్లే అతనికి ఇస్తుంది.

అవును...
వాళ్లు అ

అబ్దుల్ కరీమ్ కేరళవాడయిన
నడిపేవాడు. బాల్ థాకరే పుణ్యవ
సొంత ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చి
తిరిగి వచ్చేసి ట్రావెల్ వ్యాపారం
చిట్టచివరికి ప్రశాంత జీవనం గడ
గ్రామంలో 3,750 రూపాయలతో
చేశాడు. మొత్తమ్మీద ఒక్క పాడుబ
మొక్కలు నాటి పచ్చగా చూడాలని
అధికారుల నుంచి మొక్కలు తీసు
రెండు బిందెలు కట్టుకొని నీళ్లు పో
చూసి చుట్టుపక్కల వారు నవ్వేవ
వెక్కిరించేవారు. అలా చేసినా కొన
దాంతో మళ్లీ అటవీ శాఖ అధికార
తెచ్చుకునేవాడు. పొరుగునున్న అ
మొక్కలు, విత్తనాలు తెచ్చేవాడు.
వాహనాల్లో చేరవేసేవాడు. అలా
కూడిన మాటల మధ్య
మొత్తంగా 32 ఎ
అందులో ప్రస్తు
పందులు... వ
వృక్షజాతులు
కారణంగా భూ
నీరు సైతం నిరం
వుంటున్నాయి. పైగా
బావుల నీటి మట్టం పెరగడంతో
అడవిని చూసిన కార్పొరేట్లకు దా



తమిళనాడులోని అరోవిల్లేలో
అనుకున్నది చేయడం మొద
పదమూడేళ్లకు అతని కల సా
అందాలను హైతీ, కెన్యా దేశ
వలంటీర్లు తీరిక లేకుండా ప్ర
కొత్త ప్రదేశంలో నాటడం...

ఁడవులను పెంచారు...

ప్పటికీ డెబ్బైల్లో ముంబైలో ట్యాక్సీ
ం అని మరాఠేతరులు అప్పట్లో
ది. అలా అబ్దుల్ సైతం కేరళ
ుదలెట్టాడు. అయితే జీవితంలో
ాలన్న కోరికతో పరాప్ప
ఐదెకరాల భూమిని కొనుగోలు
ిన బావి మాత్రమే వుంది.
కలలు కన్నాడు. అటవీశాఖ
ొచ్చి... చిన్న మోపెడ్ మీద
ుకొచ్చి పోసేవాడు. ఇదంతా
ారు. తెలివి తక్కువ పనని
్ల మొక్కలు ఎండిపోతుండేవి.
లను కలిసి మొక్కలను
ివాసీల సాయంతో రకరకాల
ూరప్రాంతం నుంచైతే పడవల్లో,
జనాల నవ్వులు, ఎగతాళితో
మరికొంత భూమిని కొని
ారాల్లో అడవిని పెంచాడు.
ానికి నెమళ్లు, అడవి కోళ్లు,
ంటి జంతుజాలం, బోలెడన్ని
ాయిగా జీవిస్తున్నాయి. అడవి
గర్భ జల మట్టం పెరిగి బావుల్లో
తరం అందుబాటులో
ఇరుగు పొరుగు పొలాల్లోనూ
అంతా సంతోషిస్తున్నారు. ఈ
్ల రిసార్టుగా మార్చి సొమ్ము

అబ్దుల్... అడవిని నాటాడు!

చేసుకుంటే ఎలా వుంటుందన్న ఆలోచన వచ్చింది. కరీమ్ సాబ్‌ను అడిగారు కూడా. 'కోచిలో 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వున్నప్పుడు కూడా ఈ అటవీ ప్రాంతంలో 20 డిగ్రీలే వుంటుంది. అందుకే మీరు రాష్ట్రపతి భవన్‌నో, అమెరికాలోని వైట్‌హౌస్‌నో ఇస్తానన్నా ఈ అడవిని మాత్రం వదులుకోను' అంటాడు కరీమ్.

ఈ నలుగురి కథనాలు చదివాక ...కనీసం ఒక్క మొక్కయినా నాటాలన్న ఆలోచన కలిగినా చాలు!

●

ఎడారికి పచ్చ రంగు వేశాడు

పశ్చిమ ఆఫ్రికా దేశమైన బర్కినా ఫాసోలో మొక్క మొలిపించడం, పెంచడం తమ వల్ల కాదని శాస్త్రవేత్తలు సైతం చేతులెత్తేశారు. అంతా ఎడారిలా మారిపోయిందా నేల. సరిగ్గా అప్పుడు రంగంలోకి దిగాడో రైతు. అతనే యాకొబా సవడాగో. ఎలాగైనా తన చుట్టూ పచ్చటి మొక్కలను మొలిపించాలని పంతం పట్టుకు కూర్చున్నాడు. పరిష్కారం చూపమని శాస్త్రవేత్తల చుట్టూ కాళ్లరిగేలా తిరిగాడు. ఫలితం కనిపించకపోయేసరికి తన బుర్రకే పదును పెట్టాడు. పురాతన 'జాయ్' పద్ధతి తమ ప్రాంతానికి సరిగ్గా సరిపోతుందనుకున్నాడు. వెంటనే పార, గొడ్డలి తీసుకుని బయల్దేరాడు. అప్పటి వరకు వున్న సంప్రదాయ వ్యవసాయ పద్ధతులకు భిన్నంగా వేసవిలోనే పంటపొలాన్ని సాగుకు సిద్ధం చేయసాగాడు. అది చూసి ఇరుగుపొరుగు రైతులు నవ్వుకున్నారు కూడా. అయినా అవేమీ పట్టించుకోకుండా తనదైన పద్ధతుల్లో చేసుకుపోయాడు. ముందుగా 20*25 సెంటీమీటర్ల గుంతలను 50 సెం.మీ ఎడంలో తవ్వాడు. ఇలా సాళ్లను ఏర్పాటు చేశాక... గుంతల్లో కొంత సంప్రదాయ ఎరువు వేశాడు. తొలకరి వానతో నేల తడిశాక ప్రతి గుంటలోనూ విత్తనాలు నాటి తిరిగి కొంత మట్టి వేశాడు. ఇలా చేయడం వల్ల వర్షపు నీరు వృధా కాదు. పైగా ప్రతి గుంటా నీటిని నిల్వ చేసుకోవడం వల్ల అక్కడ మొలిచే మొక్క సజీవంగా వుండడానికి, ఎదగడానికి ఉపయోగపడేది. మొదట్లో ఈ పద్ధతిని స్థానికులు అంతగా పట్టించుకోకపోయినా.... క్రమేణా అతని పొలంలో పైరు ఎదిగే తీరు, పంట దిగుబడి వారిని ఆకట్టుకుంది. ఈ చిన్ని విజయం యాకొబాను మరింత ఉత్సాహంగా పనిచేసేలా ప్రోత్సహించింది. ఒంటి చేత్తో 30 ఎకరాల బీడు భూమిని అడవిగా మార్చాడు. 60 రకాల వృక్షాలతో, రకరకాల జంతుజాలం, కీటకాలతో ఆ అడవి అలరారుతోంది. అందుకు తన జీవితంలో 20 ఏళ్ల కాలాన్ని అంకితం చేశాడు. నిజమైన విజేత ఎప్పుడూ ఒక్క విజయంతోనే సంతృప్తి చెందడు. అంతకుమించిన మరో విజయం కోసం చెమటోడ్చుతాడు. యాకొబా అదే పని చేశాడు. తనకు తెలిసిన దాన్ని గోప్యంగా వుంచుకోక పదిమందికీ పంచాలనుకున్నాడు. రైతులను పోగేసి సాగు కోసం తను అవలంబించిన పద్ధతిని వారి ముందుంచసాగాడు. తమ అనుభవాల్లోంచి వారు కూడా మరిన్ని విషయాలను పంచుకునేందుకు ఉబలాటపడుతుంటారు. మొదటిసారిగా యాకొబా గురించి 2010లో ప్రపంచానికి తెలసింది. అదీ మార్క్ దోడ్ తీసిన డాక్యుమెంటరీ 'ది మేన్ హు స్టాప్స్ ది డిజర్ట్' ద్వారా.



'సాధన'మున సమకూరు అడవైనా...

ఎక్కడ ఇజ్రాయిల్! ఎక్కడ ఇండియా! భారత్‌లో అడవిని పెంచాలన్న తన కోరిక తీరడానికి సరిహద్దులు, సముద్రాలు ఏవీ అడ్డుకాలేదు అవిరమ్ రోజిన్‌కు. ఇజ్రాయిల్ పౌరుడైన ఇతను 2000 సంవత్సరంలో భారత్ వచ్చాడు. ఇక్కడ బీడువారిన పొలాలు, నీళ్ల లేక నెర్రలిచ్చిన నేలలు చూసి అతను కదిలిపోయాడు. 'అక్కడే కనక పచ్చటి అడవి వుంటే?' అని తనను తాను ప్రశ్నించుకున్నాడు. భార్యతో చర్చించి ఇండియా వచ్చేశాడు కుటుంబ సమేతంగా. 70 ఎకరాల బంజరు భూమిని కొన్నాడు. 150 మంది స్థానిక వలంటీర్ల సాయంతో మెల్లగా తను
ెట్టాడు. 18,000 దేశీయ మొక్కలను ఎక్కడెక్కడి నుంచో తెప్పించి నాటి సాక సాగారు. సరిగ్గా
ారమైంది. పలు రకాల వృక్షజంతు జాలంతో కూడిన అడవి సాధ్య మైంది. తమిళులకు చూపించిన అటవీ
ులకూ పరిచయం చేయాలని ఉబలాటపడుతున్నాడు. అందుకు తమ 'సాధన ఫారెస్ట్' ఇప్పుడక్కడి
ోగాలు చేస్తున్నారు. తమ అడవిలోని వృక్షాల నుంచి విత్తనాలు సేకరించడం, వాటిని మొలకెత్తించడం,
దే అవిరమ్ నేతృత్వంలోని యువ వలంటీర్ల పని.

వింత లోకం

ఏదీ పర్‌ఫెక్ట్ కాదు



పళ్లు, కూరల్ని నాలుగైదు సార్లు చూసుకునే బుట్టలో వేసుకుంటాం. రంగు దగ్గర నుంచి షేప్ వరకు ప్రతిదీ లెక్కే. విదేశాల్లో అయితే మరీనూ. కాస్త వంకర పోయినా కాయను వదిలేస్తారు, కాస్త రంగు తగ్గినా పారేస్తారు. ఈ విషయంలోనే వృథాను తగ్గించాలని కెనడాలోని ఓ సూపర్ మార్కెట్ ప్రయత్నిస్తోంది. చూడ్డానికి ఇంపుగా కనబడని కూరగాయలు, పండ్లకు 'నథింగ్ ఈజ్ పర్‌ఫెక్ట్' (ఏదీ పర్‌ఫెక్ట్ కాదు) అనే ట్యాగ్‌ను జతచేశారు. ద్వితీయ శ్రేణిలోకి వచ్చే ఈ తరహా పళ్లకు ధర కూడా బాగా తగ్గించారు. చూడటానికి విచిత్రంగా వున్నా రుచిలో ఏ మాత్రం తేడా లేకపోవడంతో కెనడా వాసులు వీటిని ఎగబడి మరీ కొనేస్తున్నారు. వింతగా కనబడే కూరలే కాదు పళ్ళు, ఉల్లిపాయలు, పుట్టగొడుగులు ఇలా రకరకాల పదార్థాలని ఈ సూపర్ మార్కెట్‌లో అమ్ముతున్నారు.

నాలుగు రోజుల్లో ఇల్లు

ఓ స్క్రూ డ్రైవర్‌తో నాలుగే రోజుల్లో ఇల్లు బిగించి ఇచ్చేస్తానంటోంది ఫ్రాన్స్‌కు చెందిన ఓ ప్రముఖ ఆర్కిటెక్చర్ కంపెనీ. ఆ రెడీమేడ్ ఇంటికి పాపప్ హౌస్ అని పేరు కూడా పెట్టేశారు. ముందుగా ఫ్యాక్టరీలో రూపొందించిన కలప బ్లాక్‌ల్ని అనుసంధానం చేసి ఇల్లు కడతారు. హాల్, వంట గది, డైనింగ్, బెడ్‌రూమ్, టాయిలెట్స్‌తోపాటుగా ఆఫీస్ రూమ్, లివింగ్ రూమ్‌లను కూడా పాపప్ హౌస్‌ల్లో కూర్చేశారు. ఈ వాటర్‌ప్రూఫ్ గృహాల ఇంటి గోడలు, పైకప్పు, గచ్చు అన్నీ కలపతో రూపుదిద్దుకున్నవే. ఫ్రాన్స్‌లోని ఏఈఎక్స్ ఎన్ ప్రావిన్స్‌లో తొలి పాపప్ హౌస్‌ని 1614 చదరపు అడుగుల్లో ఓపెన్ టెర్రస్‌తో మలిచారు. వీటిని ఫ్రాన్స్ వాసులు ఆన్‌లైన్‌లోనూ ఆర్డర్ చేసుకుంటున్నారు. వీటికి ఆదరణ పెరగడంతో యూకే, యూఎస్‌లలో కూడా విస్తరించేందుకు ప్రయత్నాలు ప్రారంభించేశారు.

నిరాశ్రయులకో రెస్టారెంట్

చిరునవ్వులతో స్వాగతాలు, అతిథి మర్యాదలు, రకరకాల వంటకాలతో అందంగా ఏర్పాటు చేసిన టేబుల్స్.. ఇవన్నీ పెద్ద పెద్ద రెస్టారెంట్‌లలో కస్టమర్ల స్థాయిని, హోదానీ ప్రతిబింబించే దృశ్యాలు. వాటిని దూరంగా చూస్తూ నాలుక చప్పరించడమే తప్ప లోపలికి ఓ అడుగు వేసేంత ధైర్యముండదు చాలా మందికి. ఇక నిరాశ్రయులు వాటి వంక కూడా తేరిపారా చూడకుండా గార్డులు తరిమేస్తుంటారు. అలాంటి వారి కోసం అమెరికాలోని కేన్సాస్‌లో ఓ రిచ్ లుక్కున్న కమ్యూనిటీ వంటశాలను తెరిచారు. ఇక్కడ రుచికరమైన వంటలను ఉచితంగా అందించడంతోపాటు, అక్కడికి వచ్చేవారి అభిరుచి, సంప్రదాయాలను తెలుసుకుని మరీ ఆహారాన్ని వడ్డిస్తారు. డబ్బులు చెల్లిస్తేగానీ లభించని మర్యాద, భోజనం కంటే.. ఇక్కడ పనిచేసే వలంటీర్స్ అందించే ఆప్యాయత పూట గడవని నిర్భాగ్యులనే ఆలోచనను రానీకుండా చేస్తోంది. ముప్పైయేళ్ల క్రితం క్రరీ అనే వ్యక్తి ఆకలిపస్తులతో ఇక్కడికే వచ్చి కడుపు నింపుకున్నాడు. అప్పట్లో ఉన్న చిన్న వంటశాలనే ఇప్పుడు క్రరీ అభివృద్ధి చేస్తూ నడుపుతున్నాడు. అక్కడి హోటళ్లు, రెస్టారెంట్‌ల్లో పనిచేయాలనుకునే వారు ఇక్కడ అప్రెంటిస్ చేస్తారు. అలా సిబ్బంది సరిపోతారు. హోటల్ మేనేజ్‌మెంట్, కుకింగ్ కోర్సులను అందించడం ద్వారా వచ్చే ఆదాయంతో, విరాళాలతో భోజన ఏర్పాట్లు చేస్తున్నారు.



కేశాలతో కోట్..

రొమేనియాకు చెందిన వృద్ధురాలు ఒర్టాన్సా పాస్కారియి (65) వార్డ్‌రోబ్‌లో ఓ ప్రత్యేకమైన కోట్ ఉంది. స్టాసెనీలో నివసిస్తున్న ఈ బామ్మ పెద్దల నుంచి ఓ మాట విందట.. తల దువ్వాక ఊడిన జుట్టును పారేయకూడదని. అది అందాన్ని పారేసుకోవడంతో సమానమట. అది నిజమేననిపించిది ఒర్టానాకు ఎందుకంటే ఆమె జుత్తు నడుం కింద వరకు వచ్చేది. అందుకే గత 20 ఏళ్లుగా ఊడిన జుట్టును జాగ్రత్త చేస్తూ వస్తోంది. ఆరు పదుల్లోకి వచ్చేసే సరికి కిలో బరువుకు పోగైందట. దాన్ని అలా వదిలేయకుండా ఏదైనా చేస్తే బాగుండనిపించింది ఒర్టాన్సాకు. పొడుగ్గా, నిగారింపుతోనున్న వాటితో కోట్ ఎందుకు అల్లకూడదని తోచిందో లేదో ఒకే ఒక వారంలో పూర్తిచేసేసింది. ఐదేళ్ల పాటు భద్రపరిచాక దాన్ని దగ్గరలోని ఓ ఎథ్నోగ్రాఫిక్ మ్యూజియానికి అందించింది.

కొత్త పుస్తకాలు

సామాజిక జీవనంలో-వైజ్ఞానిక స్పృహ

తడియారని స్వప్నం
రచయిత: లోసారి సుధాకర్
వెల: 100/-
పేజీలు: 127/-
ప్రతులకు: లోసారి సుధాకర్
ఇంటి నెం: 39/449-17
రోడ్ నెం. 13
వివేకానంద నగర్.కడప

నల్లమల్ల నందివర్ధనాలు
రచయిత: డా॥ కురుమేటి కిశోర్ కుమార్
వెల: 50/-
పేజీలు: 140/-
ప్రతలకు: డా॥ కురుమేటి కిశోర్ కుమార్
మోడల్ దంతవైద్యశాల
25-555, శ్రీనివాస నగర్,
నంద్యాల, కర్నూలు

మానవుడు ఆదిమానవ దశ నుండి విజ్ఞానవంతుడైన మనిషిగా మారాడు. అంతరిక్షంలోకి రాకెట్ పంపాడు. క్లోనింగ్ ద్వారా సృష్టికి ప్రతిసృష్టి చేస్తున్నాడు. సైన్స్ అభివృద్ధి అపుడే ఊపందుకున్న రోజుల్లోనే సి.వి.రామన్ వైజ్ఞానిక పరిశోధనలు చేసి నోబెల్ బహుమతి పొందాడు. వేల ఏళ్ల క్రితమే ఆర్యభట్టు గణితంలో వర్గం, వర్గమూలం, ఘనం, ఘనమూలం కనుగొన్నాడు. బ్రహ్మగుప్తుడు ఖగోళ శాస్త్రానికి సంబంధించి కొన్ని సూత్రాలు చెప్పాడు. వీరంతా మన దేశకీర్తిని పెంచారు. నేడు సైన్సు బాగా అభివృద్ధి చెందినా దానితో సమానంగా మూఢనమ్మకాలూ అభివృద్ధి చెందుతున్నాయి. మన దేశంలో చదువుకోని వారికన్నా... చదువుకున్న విద్యావేత్తలే, మూఢనమ్మకాల వైపు మరులుతున్నారని క్లుప్తంగా పాఠకుని మనసుకు నాటుకునే విధంగా 'సామాజిక జీవనంలో-వైజ్ఞానిక స్పృహ' పుస్తకంలో వివరించారు రచయిత డా.దేవరాజు మహారాజు. తన పుస్తకం ద్వారా పాఠకులను విజ్ఞాన వీచికల వైపు అడుగులు వేయించే ప్రయత్నం చేశారు. ప్రతి వ్యాసం చదువుతుంటే అవి నిత్యం మనకు ఎదురయ్యే సంఘటనలుగా కనిపిస్తాయి. ఉదాహరణగా ఉబ్బసానికి చేప మందు గురించి ప్రస్తావిస్తూ.. అది ఒక నమ్మకమే కానీ వైద్యం కాదని వ్యాసంలో

సామాజిక జీవనంలో-వైజ్ఞానిక స్పృహ
రచయిత:
డా.దేవరాజు మహారాజు
వెల : 70/-
పేజీలు : 104/-
ప్రతులకు :
నవచేతన పబ్లిషింగ్ హౌస్, బండ్లగూడ, హైదరాబాద్ మరియు నవచేతన బుక్ హౌస్, విశాలాంధ్ర బుక్ హౌస్

వివరించారు. నిజామాబాద్ జిల్లాలో మేకతల ఆకారంలో గల ఒక చెట్టుకు కొబ్బరి బోండాం ముడుపు కట్టడం ద్వారా వీసా వస్తుందని ప్రచారం ఉంది. దీన్ని ప్రశ్నించడాన్ని 'వీసా గాడ్' వ్యాసంలో చదవచ్చు. అలాగే కొన్ని ప్రాంతాల్లో పిడకల్తో కొట్టుకోవడం, రాళ్లతో కొట్టుకోవడం, కర్రలతో కొట్టుకోవడం, పీర్లపండుగలో రక్తం కారేట్టు కొట్టుకోవడం వల్ల నిజంగా దేవుడు ప్రసన్నుడవుతాడా? అంటూ సాగే 'దేవుడు-మానసిక హింస' వ్యాసంలో చూడొచ్చు. ఇవే కాకుండా వైద్య, శాస్త్ర రంగాలలో జరిగే మోసాల గురించీ వివరించారు. మూఢనమ్మకాల్లో సైన్సుగురించి తెలుసుకోవాలనుకునే వారికి ఈ పుస్తకం మంచి ఉపయుక్తం.

కళాకారుల 'బతుకాట'

నవలలు రాయడం తగ్గిపోతున్న ఈ రోజుల్లో మంచి ఇతివృత్తంతో నవల రాయడం అంటే సాహసమే. సాధారణ ఇతివృత్తాలతో ప్రాచుర్యం, ఆదరణ పొంది, నేడు అంతరించిపోతున్న రంగస్థల కళకు సంబంధించి, ఆ కళాకారులు అనుభవించిన బాధల గురించి, వారి జీవనంలో వచ్చిన మార్పుల గురించి, వారి వ్యథాభరితమైన దైనందిన జీవితాలను గురించి పరిశోధనాత్మకంగా, విపులంగా పాఠకులకు అందించిన నవల "బతుకాట". ఈ నవలలో రచయిత వి.ఆర్.రాసాని చిత్తూరు జిల్లాలో వాడుకలో ఉండే మాండలీకాన్ని ఉపయోగించారు. చదవటానికి ఇది నవలే, కానీ నిజానికి కళాకారుల జీవితాలలో జరిగే వాస్తవాలకు ప్రతిరూపం. బతుకాట నవల ద్వారా కళలను, కళాకారులను, వారి జీవితాలపై

బతుకాట నాటకం
రచయిత :
డా.వి ఆర్. రాసాని
వెల: 150/-
పేజీలు: 174/-
ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, చుట్టుగుంట, విజయవాడ మరియు అన్ని విశాలాంధ్ర బుక్‌హౌస్‌లలో

ప్రభావితం చేస్తున్న కుట్రలు, కుతంత్రాలు, రాజకీయ పరిస్థితులను కొన్ని పాత్రల ద్వారా పాఠకులకు తెలియజేసే ప్రయత్నం చేశారు రచయిత. చక్కని ఇతివృత్తాన్ని నవలగా మలచటం ద్వారా ఆమెరికా వారి తానా అవార్డును పొందటమే కాక, నవ్యాంధ్రప్రదేశ్ డిగ్రీ మొదటి సంవత్సరం పాఠ్యాంశంగా నిర్ణయించింది ప్రభుత్వం. బతుకాటలోని కథావస్తువు చిత్తూరు జిల్లా కుప్పం సమీపంలోని యామగాని పల్లె అనే గ్రామంలో రంగస్థల కళకే అంకితమైన ఒక కుటుంబ గాథ ఇది. నవలలో సిద్ధప్ప అలియాస్ సిద్దోజీ ప్రధాన పాత్రధారి. ఇది సిద్దోజీకి ముందు ఐదు తరాల వారి గురించిన కథ. ఈ ఐదు తరాల జీవిత కాలంలో రంగస్థల కళను బతికించుకోవటానికి వారు పడిన బాధలను, వారు ఎదుర్కొన్న ఆటు-పోట్లను, నాటి సమకాలీన పరిస్థితులను తెలియజేస్తుంది 'చివరితరం'. నమ్ముకున్న కళకే అంకితమై ఆ బాధలతోనే సిద్దోజీ మరణంతో కథ ముగుస్తుంది. నవలలో విసుగు తేకుండా కొన్ని చారిత్రక సంఘటనలు, కొన్ని హాస్య సంఘటనలు కొన్ని హృదయాన్ని కరిగించే సంఘటనలు చేర్చటం వల్ల పాఠకుడికి కొత్త అనుభూతి కలుగుతుంది.

-విష్ణుభొట్ల రామకృష్ణ

నైన్టీస్‌లో టీన్

మరణం అంచున ఉన్న భర్తను చూసేందుకు నోర్మా ఎస్యూ్య ఆస్పత్రిలోని హాస్పైస్‌కు వెళ్లింది. హాస్పిటల్‌లో చివరన ఉండే ఈ విభాగంలో భర్త వద్దకు వీల్ చైర్ సాయంతోనే వెళ్లింది. ఆమెకు 90 ఏళ్లు. భర్త లియోతో కలసి 67 ఏళ్ల జీవితాన్ని పంచుకుంది. కొన్ని రోజులుగా భర్త అలా మంచానికే పరిమితమై ఉండటం చూసి ఆమె తట్టుకోలేకపోయింది. ఒక్కసారిగా కుప్పకూలడంతో ఆమెకూ వైద్యులు పరీక్షలు చేశారు. లియోతో పంచుకున్న ఎన్నో విషయాల్ని నోర్మా కదిలిస్తోంది. ఏడు దశాబ్దాల నాటి వారి ప్రేమ కథను తెరలు తెరలుగా గుర్తు తెచ్చుకుంటోంది. లక్షలాది మధురానుభూతులతో నిండిపోయిన వారిది నిండు జీవితం అని అందరు అంటుంటారు. సమస్యల్లా ఎంత నిండు జీవితం చూసినా, ఎంత ఎక్కువ కాలం కలసి బతికినా నిండైన ప్రేమలో ఎప్పటికీ ఇద్దరికంటూ ఇంకో క్షణం వెలితే ఉంటుంది. ఇప్పుడు వారివురూ శాశ్వత వీడ్కోలు తీసుకునే క్షణాల్లో ఉన్నారు. నోర్మా కళ్లు చెమ్మగిల్లాయి. జ్ఞాపకాలు మసకబారాయి. నోర్మాను డిస్టర్బ్ చేసే ఉద్దేశం లేకో ఏమో మళ్లీ కలుద్దామంటూ మాటివ్వకుండానే... లియో తుది శ్వాస విడిచాడు. కొడుకు వచ్చి విషయం చెబితే గానీ ఆమెకు అర్థం కాలేదు. నిద్రపోయినట్టే ఉన్నాడు కదరా.. అంటూ కొడుకును మందలించబోయింది కానీ ఆమే తమాయించుకుంది. ఎవరు ముందుగా వదిలి వెళతారనే ప్రశ్న చివరి రోజుల్లో పదే పదే వారి మధ్యకు వచ్చేది. నువ్వే నన్ను వదిలించుకోవాలని చూస్తావ్ కానీ నేను కాదంటూ అరచేతిని గట్టిగా ఒత్తిగిలే లియోనే ఇలా చేశాడా అనుకుంది. సంస్కారాలన్నీ పూర్తయ్యాక ఒంటరితనం ముప్పిరిగొనుతుండగా ఆస్పత్రి నుంచి కబురొచ్చింది. కొడుకును ఇబ్బంది పెట్టలేక ఆస్పత్రికి చేరుకుంటే అక్కడ మరో విషాదకరమైన వార్త ఎదురుచూస్తోంది.

యాత్ర చికిత్స

నోర్మాకు గర్భాశయ ముఖ ద్వార క్యేన్సర్ ఉందని వైద్యులు చెప్పారు. శస్త్రచికిత్స, కీమోథెరపీ చేయించాలని, ఇంత పెద్ద వయస్సులో అవి చేసినా ప్రాణాలు నిలబడతాయనే గ్యారంటీ అయితే ఇవ్వలేమని చెప్పారు. తనలో సగం దూరమై ఇంకా రెండ్రోజులు కూడా కాలేదు ఇంతలో ఈ వార్త విన్న నోర్మాకు ఇక జీవితంపై ఏం ఆశ ఉంటుంది.

90 ఏళ్ల ఓ అవ్వ ప్రాణమైన భర్తను కోల్పోయి రెండే రోజులైంది. ఇంతలో ఆమెకు క్యేన్సర్ కూడా ఉందని తేలింది. 67 ఏళ్ల సంసారానికి సాక్ష్యమైన ఇంట ఇక ఒంటరిగా తిరగలేదు. తమ ప్రేమకు గుర్తైన కొడుకు కుటుంబాన్ని ఇపుడే వీడే ప్రసక్తే లేదు. చికిత్స చేయించుకోడానికి తన ఒళ్లు సహకరిస్తుందో లేదోననే అనుమానం. ఇంట్లో మరింత విషాదం. ఈ వాతావరణాన్నంతటినీ ఒక్క నమ్మశక్యం కాని నిర్ణయంతో తలకిందులు చేసేసిందా బామ్మ. కుటుంబంతో కలసి సరదాగా ప్రపంచాన్ని ఓ రౌండేసేయాలని కొడుకుతో చెప్పింది. చివరి రోజుల్లో కుటుంబానికి సంతోషం పంచి సెలవు తీసుకోవాలనేది ఆమె ఉద్దేశం.

కొడుకు టిమ్ తృప్తి కోసం ఏదో ఒక చికిత్సకు తలూపుతుంది అనుకున్నారు వైద్యులు. కానీ నోర్మా మాత్రం "సరే అయితే, నాకే వైద్యం వద్దు కానీ, దేశం తిరిగేస్తాను..." అంటూ జవాబిచ్చింది. కొడుక్కు అర్థమైంది. నోర్మా భర్తలా మంచానికి అతుక్కుపోయి వేదన అనుభవిస్తూ చావుకు ఎదురుచూసి బాధను రెట్టింపు చేసుకోదని, 70 ఏళ్లు పంచుకున్న ఇంటిలో ఇప్పుడు ఒంటరిగా తానొక్కతే ఉండలేదని. "సరే తిరిగేద్దాం..." అంటూ అక్కడే ఓకే చేసేశాడు టిమ్. కోడలు రేమీకి కూడా ఈ ఆలోచన అద్భుతంగా అనిపించింది. ఎందుకంటే రేమీ అంతకు ముందే అతుల్ గవాండే రాసిన 'బీయింగ్ మోర్టల్: మెడిసిన్ అండ్ వాట్ మ్యాటర్స్ ఇన్ ద ఎండ్' పుస్తకాన్ని చదివింది. చివరి రోజుల్లో ఏది ముఖ్యమనే లోతైన విషయాల్ని అందులో చర్చిస్తారు. ఇలాంటి కుటుంబాన్ని చూసి ఆశ్చర్యపోయిన వైద్యులు తేరుకుని 'సరే మీ యిష్టం' అంటూ తలూపారు. మరీ మలిసంధ్యలో ఉండేవారికి క్యేన్సర్ చికిత్స ఎంత వేదనాభరితంగా ఉంటుందో దగ్గరుండి చూడటం వల్ల వైద్యులు ఎస్యూ్య కుటుంబం నిర్ణయాన్ని కాదనలేకపోయారు. నోర్మా కొడుకు, కోడలితో పాటు ఆ ఇంట్లో మరో ముఖ్యమైన సభ్యుడు ఉన్నాడు. అదే రింగో అనే పూడ్ల్. మనిషి కన్నా ఎత్తు ఉండే ఆ కుక్క కూడా వాళ్లకు సొంత మనిషి కన్నా ఎక్కువ. అందరూ కలసి టూర్ ప్లాన్ చేసేశారు. భర్త చూపిన ఊర్లు, పార్కులు, పర్యాటక ప్రదేశాలతో పాటు వెళదామని మిగిలిపోయిన స్పాట్లను కూడా చక్కగా గుర్తుపెట్టుకుంది. టూర్ అంటే ఏదో ఒక రైలు ఎక్కి మరో రైలు దిగడం కాదు. ఓ విమానంలో వెళ్లి మరో విమానంలో తిరిగి రావడం కాదు. దాని కోసం ఆర్వీని సిద్ధం చేసుకున్నారు. చిన్న ఇంటంతిటనీ సర్దుకున్న మినీ బస్ అంత ఉండే మోటార్ వాహనమే ఆర్వీ. దానిలోనే తిండీ తిప్పలూ, నిద్రలు. గతేడాది ఆగస్టులో 'డ్రైవింగ్ మిస్ నోర్మా' అంటూ వారి యాత్రకు పేరు పెట్టుకుని అమెరికా అంతటా ప్రయాణం కట్టారు. ఉత్తర మిషిగాన్‌లోని తమ ఇంటి నుంచి బయలుదేరి తొలుత దక్షిణ



డకోటాలోని మౌంట్ రష్మోర్ చేరుకున్నారు. అక్కడ వారి ఫోర్ ఫాదర్స్‌కు ఓ సెల్యూట్ చేసి ఒక్కో రాష్ట్రం దాటారు. వ్యోమింగ్, కొలరాడో, లూసియానా, ఫ్లోరిడా, అరిజోనా, న్యూమెక్సికో ఇలా వారి యాత్రంతా రోడ్డు మార్గంలో కొనసాగింది.

అన్నీ స్పెషల్సే...

రోస్‌వెల్‌లోని యూఎఫ్‌వో మ్యూజియం అండ్ రీసెర్చ్ కేంద్రంలో గ్రహాంతరవాసుల క్లూ ఏమన్నా దొరుకుతుందేమోనని ఇంతింత కళ్లతో చూశారు. ఫ్లోరిడాలోని వాల్ట్ డిస్నీ వరల్డ్‌లో పిల్లలతో పోటీగా కేరింతలు కొట్టారు. కార్న్ ప్లేస్‌లో మొక్కజొన్న పొత్తు బొమ్మతో ఫొటోలు దిగారు. రివర్‌వ్యూ ఆర్వీ పార్క్‌లో హల్‌చల్ చేశారు. ఇలా ఒక్కొక్క ప్రాంతం దాటుతుంటే కొత్త మిత్రులు కలిశారు. ఆటపాటల్లో రోజులు దొర్లిపోతున్నాయి. ఆశ్చర్యకరంగా క్యాన్సర్ లక్షణాలు క్రమంగా తగ్గుతున్నాయి. శరీరానికేమో గానీ మనసుకు మాత్రం బాగా పనిచేసిందా యాత్రా చికిత్స. బాధ కూడా తెలీడం లేదు నోర్మాకు. ఎల్లో స్టోన్ జాతీయ పార్కులో వేడి నీటి ఊటల్ని, అగ్నిపర్వత వాతావరణాన్ని చూసి ఎంతో అతిశయానికి లోనైంది నోర్మా. భూమి లోలోతుల్లోంచి ఉబికివచ్చే నీరు నిండు నారింజ వర్ణం, చిలుక పచ్చని రంగుల్లో కలగలసి మడుగులు ఏర్పడటం చూసి ఆమె అక్కడే కాసేపు నిలిచిపోయింది. పదుల అడుగుల ఎత్తుకు ఎగజిమ్ముతున్న వేడి నీటి స్ప్రింగ్స్ ప్రకృతి రూపొందించుకున్న ఫౌంటెయిన్ వ్యవస్థలా అనిపించింది. కాలిఫోర్నియాలోని పామ్ స్ప్రింగ్స్‌లో ఏకంగా హాట్ ఎయిర్ బెలూన్‌లో ఆకాశాన్నందుకుని ముచ్చటపడింది నోర్మా. మబ్బు పొరల్లో మెల్లిగా సాగిపోయే బెలూన్‌లో ఎక్కడలేని స్వేచ్ఛ కలిగినట్టయిందని మురిసిపోయింది. నోర్మా నిర్ణయం ఎలా ఉంటుందోనని సందేహపడ్డా చివరకు అది మంచి టర్న్ తీసుకోవడంతో 'డ్రైవింగ్ మిస్ నోర్మా' పేరిట ఫేస్‌బుక్‌లో ఓ పేజీని తెరిచారు. ఎప్పటికప్పుడు ఆమె యాత్ర వివరాల్ని అందిస్తూ మరికొందరు క్యాన్సర్ పీడితుల్లో ఉత్సాహం కలిగించాలని, జీవితంపై ఆశ రేకెత్తించాలని ప్రయత్నం చేస్తున్నారు. వారు అనుకున్నట్టే సుమారు 70 వేల మంది ఆ పేజీని ఫాలో అవుతున్నారు. వీరిలో క్యాన్సర్‌తో పోరాడుతున్న రోగులు, క్యాన్సర్ వల్ల తల్లిదండ్రుల్ని కోల్పోయిన పిల్లలతో పాటు మిగతావారు కూడా ఉన్నారు. నోర్మా యాత్రకు మద్దతుగా ఎన్నో కామెంట్లను పెడుతూ ఆమెలో ఉత్సాహాన్ని మరింత పెంచుతున్నారు. వారు కూడా నోర్మా నుంచి స్ఫూర్తి పొందుతున్నారు.

ఊళ్లంతటా గోలే..

దేశదేశాలకు చేరిపోయిన నోర్మా కథ ఎందరినో కదిలించింది. అలా ఐర్లాండ్ నుంచి కింబెర్లీ మొరెస్సీ అనే వ్యక్తి ఓ పోస్ట్ పెట్టింది. నోర్మా చాటుగా తాను సాహసాలు చేస్తున్నానని, నోర్మా ఓ ఆదర్శమని, ఎందరికో ఓ హీరో అని అభిమానాన్ని ప్రకటించింది. ఇంగ్లండ్‌లోని కౌంటీ డర్హామ్‌కు చెందిన శాండ్రా థాంప్సన్ అనే మరో వ్యక్తి నోర్మా కుటుంబ అనుబంధాల్ని చూసి ముగ్ధురాలైంది. "మిస్ నోర్మా మీరు మీ కుటుంబం మాకో స్ఫూర్తి. మన కాలం ఎంతో అమూల్యమైందని, మన ప్రాణ బంధాలతో ఆ సమయాన్ని పంచుకోవాలనే గొప్ప జీవిత పాఠాన్ని నేర్పుతున్నార"ని కామెంట్ చేసింది. ఇలా ఆన్‌లైన్‌లో వెల్లువలా వస్తోన్న మద్దతు చూసి మీడియా కూడా నోర్మా వెంట పడింది. ఆమెతో ప్రత్యేక ఇంటర్వ్యూలు, ఫాలోయింగ్ కార్యక్రమాలు కూడా రూపొందించి ఆ బామ్మలోని స్పిరిట్‌ను అందరికీ పరిచయం చేసింది. అంత వయసులోను చిన్నారిలా అనుభూతించగలడం ఒంటరిగా మగ్గిపోకుండా హుషారుగా ప్రపంచాన్ని చుట్టేయాలనుకోవడం వంటివి చాలా మందిని ఆకట్టుకున్నాయి. చేవ ఉండి కూడా నిస్సత్తువుగా, నిస్తేజంగా ఊగిసలాడే కుర్రకారుకు కూడా బోలెడంత జోష్‌నిచ్చింది ఆమె యాత్ర. నోర్మా కుటుంబంతో సందర్శించిన ప్రాంతాల్లో ఫ్లోరిడాలోని సెయింట్ అగస్టీన్‌లోని 'కాస్టిల్లో డి సాన్ మార్కోస్' కోట కూడా ఉంది. కోటంతా కలియ తిరిగి చూసింది నోర్మా. కోటలతో ఆగలేదు కౌబాయ్‌ల గోల్డ్ క్వెస్ట్‌లకు అడ్రస్‌గా చెప్పే గ్రాండ్ కేన్యోన్‌కు సాహసం చేసింది. ఓ కళాఖండంగా పరుచుకున్న దక్షిణ రిమ్ వద్ద నించొని కనుచూపు మేరంతా నారింజ వర్ణ ధూళితో నిండిపోయే భూభాగాన్ని తన అద్దాల ఫ్రేముల్ని సరిచేసుకుంటూ పానోరామా లుక్ వేసింది. కెన్నెడీ అంతరిక్ష కేంద్రాన్ని కూడా సందర్శించింది. అంతరిక్ష యాత్రల్లో మైల్‌స్టోన్‌గా నిలిచిపోయిన అపోలో మిషన్‌ను అప్పట్లో దగ్గరుండి చూసి ఉండొచ్చు. ఆ జ్ఞాపకాల దొంతరల్ని కదిలించేందుకు ఆ సైట్‌లో టెంటేసింది. ఆర్నెల్లు గడిచాక ప్రపంచ యాత్ర చేయాలనే కలను సాకారం చేసుకుంటోంది. చైనాతో పాటు యూరప్‌లోని దేశాల్లోను పర్యటించింది. ఇంకా ఆ యాత్ర కొనసాగాలని కోరుకుందాం. బామ్మ కథ విన్నాక ఓ పాట గుర్తొస్తోంది. జీన్స్ సినిమాలో 'రావే నా చెలియా..' అనే పాట సరిగ్గా సరిపోతుంది నోర్మాకు. రయ్యంటూ ప్రపంచాన్ని చుట్టేస్తున్న ఈ వయసైన చెలియా వారెవా అనేలా ఊరంతా గోల చేస్తోంది. నైన్టీస్‌లో టీన్‌లా అల్లరి చేసేస్తోంది.

- అనన్య ప్రసిద్ధ్

ఆహ్వానం

మీ కవితలు పంపాల్సిన చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4,
ఆకుల వారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్
: snehaweekly.praja@gmail.com

గాథ

వాస్తవాలు తెలియని
వెర్రివాళ్లు కాదు
ప్రజలు చైతన్యవంతులు!

అధికారానికి అర్హతలు
శాడిజం ఫ్యాక్షనిజాలా?!

పరిపాలనా దక్షత
ప్రజలలో నమ్మకం
పదవికి సర్టిఫికెట్!

రౌడీయిజమే
రాజకీయమనుకునే
పిచ్చోళ్లు కాదు
ఓటర్లు!!

రాపోలు పరమేశ్వరరావు



కన్నీటి సంకెళ్లు

కేర్ కేర్ మని ఏడ్చే నిస్వార్థపు కేకకు తెల్సు
పుట్టీ పుట్టగానే ఆమె ప్రాణాలు
ఆవిరవుతాయని
కిల కిల కూసే కోయిలకి తెల్సు
ఆమె నవ్వులకు ఆంక్షలున్నవని
భగ భగ మండే సూర్యుడికి తెల్సు
ఆమె హృదయం అగ్ని పర్వతమని
ఫెళ ఫెళ చీలే భూమికి తెల్సు
అంతటి సహనం తనకైనా ఉండబోదని
ఎర్రెర్రెటి రక్తపు గాయాలకి తెల్సు
భరించి రగిలే మంటల కొలిమి ఆమెని
మల మల మాడే ఆకలి కడుపుకి తెల్సు
చరిత్రలన్ని ఆమె పొట్టనుండే
ఉద్భవించాయని
కట కట కరువుతో ఎండిన చెట్లకి తెల్సు
గుండెలో దాగిన బాధకి విరుగుడు ఆమెని
దాహం తీరని కోర్కెకి తెల్సు
ఆశల వెచ్చటి కౌగిలి ఆమెని
వెలుగును కోల్పోయి చీకటి నిండిన
నిశ్శబ్దానికి తెల్సు
ఆమెతో స్నేహం విలువైనదని
ఆమెతో గడిపిన క్షణాలు తిరిగిరానివని
మనసు లోతుల్లో దాగిన
తీరని స్వప్నాలకు తెల్సు
తల్లడిల్లే తాపం తట్టిలేపే ధైర్యం ఆమెని
ఎగసెగసిపడే కెరటాలకి తెల్సు
ఆమె ప్రయాణం సుడిగుండాల్లో ఎదురీతేనని
వెక్కిరినవ్వుల విధిరాతకి తెల్సు
జీవితమంతా ఆమెకి కన్నీటి సంకెళ్లేనని
మగవాడి చరసాలలో ఎప్పటికీ ఆమె
బానిసేనని
శోకము నిండిన విశ్వానికి తెల్సు
ఆమె లేనిదే సృష్టిలేదని
ఆమెను సృష్టి హింసిస్తోందని
క్షణక్రితమే ప్రాణాలొదిలిన
ఓ నిస్సహాయ స్త్రీ ఊపిరికి తెల్సు
సమాజమే తనని బలిపశువుని చేసిందని
ఆమె కన్నీళ్లతో అభిషేకం చేసుకుంటున్న
కాలానికి తెల్సు
ప్రపంచమంతా స్త్రీ ఘోష వినపడుతోందని
స్వేచ్ఛ కోసం ఆమె ప్రయత్నిస్తోందని
ఒంటరి బ్రతుకుల అడుగులకు తెల్సు
ఆమె ఒక మొరపెట్టుకున్నదని...
అందులో.......
లోకమంతా ఏకమై ఆమెకు
చేయినందించాలని
ఆమెను ముందుకు నడిపించాలని
ఆశగ చెప్పెను తన ఊసులని

మాగంటి శబరీష్
9885566388

మినప వడియాలు

కావాల్సిన పదార్థాలు

మినప పప్పు -1కిలో

జీలకర్ర -4 టీ స్పూన్లు

పచ్చి మిరప కాయలు -100 గ్రాములు

ఉప్పు - తగినంత

తయారుచేసే విధానం

మినప పప్పును శుభ్రంగా కడిగి ఒక పాత్రలో నీరు పోసి పప్పును రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే పప్పును శుభ్రంగా కడిగి పొట్టును వేరుచేయాలి. పచ్చి మిరప కాయల్ని తొక్కి ఆ తొక్కును మినప పప్పు రుబ్బేటప్పుడు వేసి రుబ్బుకోవాలి. తర్వాత జీలకర్ర వేసి పిండిని కలపాలి. ఈ పిండిని మంచం మీద గానీ అరుగు మీద గానీ ఒక గుడ్డ లేదా ప్లాస్టిక్ పేపర్‌పై చిన్న చిన్న వడియాలుగా పెట్టుకోవాలి. ఇలా పెట్టిన వడియాలను రెండు మూడు రోజులు ఎండలో ఎండనివ్వాలి. బాగా ఎండిన తర్వాత గుడ్డ లేదా ప్లాస్టిక్ పేపర్ నుండి వేరు చేసి పొడి డబ్బాలో నిల్వ చేసుకోవాలి. ఈ వడియాలను తగినంత నూనె లేదా నెయ్యిలో వేయించుకుని తింటే ఆ రుచే వేరు!

పెసర వడియాలు

కావాల్సిన పదార్థాలు

పెసర పప్పు -1 కిలో

పచ్చిమిరపకాయలు - 50 గ్రాములు,

ఉల్లిపాయలు -100 గ్రాములు

అల్లం -చిన్న ముక్క

ఉప్పు - తగినంత

తయారుచేసే విధానం

ముందుగా పెసరపప్పును కొంతసేపు నానబెట్టాలి. తర్వాత పప్పు శుభ్రంగా కడిగి అల్లం, ఉల్లి, పచ్చిమిరపకాయ ముక్కలు వేసి మెత్తగా రుబ్బుకోవాలి. పిండి మొత్తాన్నీ ఒకేసారి కాకుండా కొద్ది కొద్దిగా రుబ్బుకుంటే పిండి విరిగిపోకుండా ఉంటుంది. రుబ్బిన పిండిని ప్లాస్టిక్ పేపర్‌పై చిన్న చిన్న వడియాలుగా పెట్టుకోవాలి. మూడు రోజులు ఎండనిచ్చి తర్వాత ప్లాస్టిక్ పేపర్ నుంచి వలిచి పొడి డబ్బాలో నిల్వ చేసుకోవాలి.





గుమ్మడికాయ వడియాలు

కావాల్సిన పదార్థాలు

బూడిద గుమ్మడి కాయ -1 కాయ

మినప పప్పు - కాయకు సరిపడా

పచ్చిమిరప కాయలు -100 గ్రాములు

ఉప్పు - తగినంత

తయారుచేసే విధానం

బూడిద గుమ్మడి కాయను సన్నగా తురిమి శుభ్రమైన పలుచటి బట్టలో మూటకట్టాలి. ఈ మూటపై ఏదైనా బరువు పెట్టి రాత్రంతా అలాగే వుంచాలి. ఇలా చేయడం వల్ల గుడ్డలో నుండి నీరంతా దిగిపోతుంది. ఉదయాన్నే గుమ్మడి తురుము గుడ్డలో నుండి తీసి ఒక ప్లేట్‌లో పెట్టాలి. మినప పప్పును మెత్తగా రుబ్బుకుని ఆ పిండిలో గుమ్మడి కాయ తురుము, ఉప్పు, పచ్చి మిరపకాయ ముక్కలు వేసి కలిపి ప్లాస్టిక్ పేపర్‌పై గానీ గుడ్డపై గానీ కొంచెం పెద్ద సైజులో వడియాలను పెట్టుకోవాలి. వీటిని నాలుగు రోజులు ఎండలో ఎండబెట్టి పొడి డబ్బాలో నిల్వ చేసుకోవాలి. ఈ వడియాలను ఉల్లిపాయలు లేదా ములక్కాడలతో పాటు వండుకుంటే రుచిగా ఉంటాయి. వీటిని వేయించుకుని చారు కాచుకున్నప్పుడు నంజుకోవచ్చు.

కాల్ మనీ

- యన్.రాజా గణేష్

9247483700

◆ కథ

"అతని ధోరణి నాకేమాత్రం అంతుపట్టడం లేదండీ" అంది లాస్య.

మౌనంగా ఉండిపోయాడు వసంత్. గది గదంతా నిశ్శబ్దం మింగినట్టుంది.

"మాట్లాడరేం? మిమ్మల్నే!" సాగదీసింది లాస్య.

"........."

మౌనమే వసంత్ సమాధానమైంది. వసంత్‌కి ఏం చెప్పాలో తోచడంలేదు. లోలోనే సలపుతున్న బాధనూ ఆందోళనా వ్యక్తం చేయలేని స్థితిలో ఉన్నాడు.

"ఇదే చెప్తున్నాను అతనూ అతని మనుషులూ ఈ ఇంటి గడప తొక్కడానికి వీల్లేదు". చిట్టచివరగా హెచ్చరించింది లాస్య.

ఏం చెయ్యాలా అని ఆలోచిస్తున్న వసంత్ సెల్ రింగయింది.

'రింగ రింగ రింగ రింగ రింగ రింగారే' సెల్ జేబులోంచి తీసి చూశాడు అదే నెంబరు. వాడే! కట్ చేసేశాడు.

మళ్లీ 'రింగ రింగ రింగ రింగ రింగ రింగారే' అసహనంగా సెల్ వైపు చూస్తుండి పోయాడు వసంత్.

లాస్య విసురుగా లాక్కుని సెల్ ఆన్ చేసింది.

"ఒరేయ్! నిన్నేరా!" అన్న వెంటనే రికార్డ్ మోడ్ ఆన్ చేసింది లాస్య.

"ఒరేయ్! నిన్నేరా! మాట్లాడవేరా? ఫోన్ ఆన్ చేసి సమాధానం చెప్పాలని తెలీదా? వసంత్ నీకిదే చివరిసారిగా చెప్తున్నాను. ఆరు నెల్ల నుండి వడ్డీ కట్టలేదు. నీకో రెండు రోజులు టైం ఇస్తున్నాను. వడ్డీ కట్టు లేదా నీ వైఫ్‌ను అప్పజెప్పు. ఒక్కసారికి కొంపలేవీ మునిగిపోవులే! ఏంటో... తేల్చి చెప్పరా!" ఆ స్వరంలో చిరాకుంది చురకుంది హెచ్చరికుంది. ఆవేశం, ఆజ్ఞ కూడా ఉన్నాయి. చెవులు రిక్కించి మరీ విన్న లాస్య కోపంతో ఊగిపోతూ లేచి కూర్చుంది.

ఫోన్ కట్ చేసి వసంత్ వైపు ఎర్రగా చూసింది. విషయం అర్థమైన వసంత్ బ్లాంక్ ఫేస్‌తో చూస్తున్నాడు.

ఫోన్‌లో ఆ నెంబరే మళ్లీ డయల్ చేసింది లాస్య.

"హలో..." అంటూ వెంటనే రెస్పాండయ్యాడు, రాయుడు.

"నేను లాస్యను వసంత్ భార్యను మాట్లాడుతున్నాను.



మావారు ఈ రాత్రికి మీ ఆవిణ్ణి పంపించమన్నారు. సరిగ్గా ఉదయం ఆరుగంటలకు మీ ఇంటి దగ్గర దిగబెడ్తాం. మీ ఆవిడ రేటెంతో చెప్తే అది కూడా ఇచ్చేస్తాం" అని తీవ్రంగా ముక్కు పుటాలెగరేస్తూ ఆవేశంగా అంది లాస్య.

స్త్రీ సహజమైన అవమాన తీక్షణత ఆమె ముఖంలో స్పష్టంగా ప్రతిబింబించింది. సెల్ లాస్య చేతిలోంచి లాక్కొని కట్ చేశాడు వసంత్.

"వాడేమన్నాడో తెల్సా మీకు?" గొంతు చించుకు అరిచింది లాస్య.

"........................."

"అందుకే నేనలా మాట్లాడాల్సి వచ్చింది. పైగా సాటి ఆడదని చూడకుండా నీచంగా మాట్లాడాల్సి వచ్చింది. ఇదంతా మీ నిర్వాకమే!" తనలో కసినంతా వెళ్లకక్కింది లాస్య. "నీకెలా చెప్పాలో అర్థం కావడం లేదు లాస్యా! పైగా నేనెంత క్షోభ పడ్తున్నానో నీకు తెలీదు. మనం రాయుడి ఉచ్చులో పూర్తిగా బిగుసుకు పోయాం. వాడి వెనకో పేద్ద గ్యాంగుంది. వాళ్లు చేసే దాష్టీకం ఇంతా అంతా కాదు. ఈ రోజు మన షాపుకు వచ్చి నానా యాగీ చేశారు. అసలే మన వ్యాపారం నష్టాల్లో ఉంది. జవాబు చెప్పలేక నాకు పిచ్చెక్కేట్టుంది. పైగా ఇప్పుడు నువ్వాళ్లని బాగా రెచ్చగొట్టావు. ఫలితం ఎంత డేంజర్‌గా ఉంటుందో నువ్వే స్వయంగా చూడు" ముగించాడు వసంత్.

"రోజూ ఎవడో ఒకడు వాడి మనిషినని వస్తూనే ఉన్నాడు. నన్ను తినేసేలా చూస్తూ వెకిలి వేషాలు వేస్తున్నారు. మొన్నటికి మొన్న నా చేతికి తన వేళ్లు కావాలనే తాకించాడు. రోజు రోజుకీ వాళ్ల ధోరణి శృతిమించిపోతోంది" అని ముగించింది లాస్య.

నిశ్శబ్దం వికృతంగా కృతకంగా వారిద్దరి మధ్యా నిలిచింది.

లాస్య కన్నీరు మున్నీరుగా వసంత్ గుండెలపై వాలిపోయింది.

భర్త అశక్తత భార్యను ఎంత బాధిస్తుందో లాస్య వేదనలో కనిపిస్తోంది. వ్యాపారంలో పోటీ, అనుభవ రాహిత్యం భవిష్యత్ దర్శనం చేయక అతడు నష్టాల్లోకి నెట్టివేయబడ్డాడు. పెట్టుబడికి మిగతా అవసరాలకూ తనకెదురైన రాయుడి కాల్ మనీ ఊబిలోకి జారి పోయాడు. నూటికి అయిదు రూపాయల వడ్డీ అని ఇచ్చి, మాట మార్చి పది రూపాయల వడ్డీ అన్నాడు. ఏ నెలకానెల వడ్డీ గుంజుతూనే ఉన్నాడు. గత ఆరు నెలల్లో వడ్డీ కట్టలేని స్థితికి చేరాడు. పొలం దస్తావేజులు తన దగ్గర ఇరికించుకున్నది కాక తన విశ్వరూపం చూపిస్తూ చెలరేగిపోతున్నాడు రాయుడు.

◆◆◆

వసంత్ లాస్య కట్టుబట్టల్తో అప్పటికప్పుడు రైల్వేస్టేషన్‌కి చేరుకున్నారు. ట్రెయిన్ ఎక్కి కూర్చున్నారు. ఇద్దరూ సీట్లలో కూర్చున్న వారిని పరికించి చూస్తుండగా "ఎక్కడికి పారిపోతున్నారు?" అనే ప్రశ్నకు ఉలిక్కిపడ్డారిద్దరూ.

కాస్సేపటికి తేరుకున్న వసంత్ "ఊరెళ్లి డబ్బులు సర్దుబాటు చేసుకుందామని" అని గొంతు పెగుల్చుకుని సందర్భశూచిగా అన్నాడు.

"కుదర్దు! ముందు మా రాయుడు గారి

దగ్గరకొచ్చి పర్మిషన్ తీసుకు వెళ్లండి!"

వసంత్ లాస్య ముఖాముఖాలు చూసుకున్నారు.

"దిగండి ...దిగండి... " అన్నాడొకడు.

"నే చెప్పేది కాస్త వినండి. ప్లీజ్...." దీనంగా అర్థించాడు వసంత్.

"ఆరు నెల్ల వడ్డీ కట్టి వెళ్లండి" అన్నాడు ఇంకొకడు.

లాస్యకి పౌరుషం ముంచుకొచ్చింది. కోపంగా మెళ్లో వున్న చైన్ శతమానాలతో సహా తీసి వారి చేతుల్లో వుంచి "ఇది మూడు తులాల వస్తువు. లక్ష రూపాయలు పైమాటే! తీసుకెళ్లండి!!" అంది లాస్య.

"ఇది మూడు నెలల వడ్డీకి సరిపోతుంది. తొందరగా వచ్చి డబ్బు మొత్తం కట్టండి లేదా పొలం రాయుడిగారి పేర్న రిజిస్టర్ చెయ్యండి" అని తేల్చి చెప్పాడు రాయుడి మనిషి.

లాస్య వాళ్ల పుట్టింటికెళ్ళి రెండు లక్షలు తేగలిగింది. వసంత్ వాళ్ల అమ్మానాన్నల్ని కలిసి అంతా చెప్పుకున్నాడు. వ్యాపారంలో లాస్ రావడం వారిని కుంగదీసింది. అయినా కొడుకు కోసం ఊళ్లో తెలిసిన వారి దగ్గర అవసరమైనంత మేరకు డబ్బు సమకూర్చారు.

రాయుడు డబ్బులందుకున్నాడు. లెక్క పెట్టుకున్నాడు. పెదవి విరిచి ఇంకా లక్ష కట్టాల్సుంది.. అవి తెచ్చిచ్చి దస్తావేజులు పట్టుకెళ్లమని తేల్చేశాడు.

"లెక్క సరిగ్గా చూశారా? మీకింకా లక్ష ఎలా వస్తుంది?" ప్రశ్నించాడు వసంత్.

"ఏటీ? ఏటి చూసేది? లక్ష తెచ్చిచ్చి మాట్లాడు." అని కసిరేసి లోపలికి వెళ్లాడతను.

ఇంటికి చేరాక విషయం తెల్సిన లాస్య ఆశ్చర్యపోయింది. "అయ్యో! మీరింత నోరు లేని వారైతే ఎలాగండీ?" అనరిచింది కూడానూ. "ఇలాక్కాదు. రేపుదయం కార్పొరేటర్ గారిని కలిసి విషయం చెప్దాం!" అని మరో మార్గం సూచించింది. ఉదయాన్నే లేచి కార్పొరేటర్ మహాత్ముని కలిసి విషయమంతా చెప్పారు. కానీ ఆశించినంత స్పందనా, పరిష్కారం అతని మాటల్లో వెలుగు చూళ్లేదు. కార్పొరేటర్ మహాత్మా పూర్తిగా రాయుడి మనిషని తేలిపోయింది.

వసంత్ దగ్గర వేరే మార్గం లేదు. లాస్య పరిష్కారం దిశగా ఆలోచించడం ప్రారంభించింది. బాగా యోచించాక పక్కవీధిలో ఉన్న మహిళా మండలి సెక్రటరీ పద్మని కలిసి చెప్తేనో అనిపించింది. తట్టిన వెంటనే వెళ్లి పద్మని కలిసి విషయమంతా చెప్పింది. అంతా విన్న పద్మ "ఆహా! అలాగా! సర్లేండి నాతో పాటురండి!!" అని ఆమెతో పాటుగా లాస్యను తీసుకెళ్లింది. ఆ ఇల్లెవరిదో కాదు! రాయుడిదే!

ఇంట్లో ఇలా అడుగుపెట్టారో లేదో రాయుడి భార్య ఎదురొచ్చి నవ్వుతూ 'రండి పద్మా' అని ఆహ్వానించింది. లాస్య చెప్పిందంతా విన్న రాయుడి భార్య గిరిజ నమ్మలేకపోయింది. వాయిస్ రికార్డర్ వినిపించింది లాస్య. రాయుడి భార్య గిరిజ మొహంలో రంగులు మారాయి. కోపంతో ఊగిపోయింది.

"గిరిజ గారూ! లాస్య నాకు బాగా తెలుసు! గౌరవమైన కుటుంబంలో అమ్మాయి. నేను చెప్పేదాంట్లో వీసమెత్తయినా అబద్ధం లేదు" అని తేల్చి చెప్పింది పద్మ. చివరికి గిరిజ "పద్మ లాస్య... మనమిలా చేస్తే బాగుంటుంది కదూ?" అంది.

మరుసటి రోజు రాత్రి ఏడు గంటలకు ఇద్దరు ఎస్కార్ట్‌లతో లాస్య ఇంటికి చేరుకున్నాడు రాయుడు. వీధి దాటి అతను పూసుకున్న సెంటు గుబాళిస్తోంది. లాస్య చిరునవ్వుతో



రాయుడ్ని ఆహ్వానించింది. మంచినీళ్లు అందిస్తూ.. "ఇదేమన్నా మీకు న్యాయంగా ఉందా? మేం ఎన్నో కష్టాల్లోనూ, నష్టాల్లోనూ ఉన్నాం. అయినా సరే మీ సొమ్ము వడ్డీతో సహా చెల్లించాం. మా దస్తావేజులూ ప్రామిసరీ నోటూ మాకివ్వకుండా ఇంకో లక్ష వస్తుందన్నారట పెద్దవారు." అని అంది. రాయుడు నవ్వి మీసం మెలేశాడు.

"నువ్వు రమ్మన్నావని చెప్తేనే నే వచ్చాను. మీ దస్తావేజులు తెచ్చానిదిగో ఇలా రా ఇక్కడ కూర్చో!" కన్నుగీటి ఆ సోఫాపై చరిచి అన్నాడు రాయుడు.

"ఆహాహా! ఇక్కడ కాదు. బెడ్ రూంకి రండి పదండి" అంది సుతారంగా లాస్య.

"ఉండండిప్పుడే డోర్ లాక్ చేసి వస్తాను.. దయచేసి మీతో వచ్చిన వాళ్లని పొమ్మని చెప్పండి ప్లీజ్..." అంది లాస్య మళ్లీ తనే.

వాళ్లు వెళ్లిపోయాక డోర్ లాక్ చేసి 'పదండి' అని బెడ్ రూం వైపు నడిచింది. తలుపు తీస్తూ "లోనికి పదండి. ఇప్పుడే వస్తాను...." అంది లాస్య.

"లేడీస్ ఫస్ట్" అని బుగ్గమీద చిటికేశాడు రాయుడు.

సిగ్గుతో జరిగి "అబ్బ! పదండీ" అని మెలికలు తిరిగింది లాస్య.

"యు నాటీ గర్ల్...." అని లోపలికి అడుగు పెట్టాడో, లేదో లైటు వెలిగింది. రాయుడు నిర్ఘాంతపోయాడు. ఉగ్ర కాళికావతారంలో పెళ్లాం గిరిజ ఓ పక్కగా నిల్చుంది. రాయుణ్ణి తీక్షణంగా చూస్తూ మరో వైపు పద్మ నిలుచుంది. యూనిఫాంలో ఎస్ఐ కుర్చీలో దర్పంగా కూర్చున్నాడు. నాతో మీకేం పనన్నట్టు ఉరిమి చూశాడు రాయుడు. కానీ అతనికి రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయానన్న గాబరా కొరడా గుండెలపై బాదుతూనే ఉంది. వెనుతిరగబోయాడు రాయుడు.

"ఆగండి! అక్కడే ఆగండి" గర్జించింది గిరిజ.

"యాంటే...... " అసహనంగా మూల్గాడు రాయుడు.

"ఇన్నాళ్లూ నేను తింటున్నది ఈ పాపిష్టి సొమ్ము అనుకోలేదు. ఈ పాపపు కూడు నా పిల్లలకి తినిపిస్తూ, అదే సొమ్ముతో నా పిల్లల్ని చదివిస్తున్నారన్నమాట. ఇలాంటి బతుకు బతికేకంటే చావడం ఎంతో మేలు! పైగా ఆడవాళ్లపై పడి కాలనాగులా కాటు వెయ్యడమా? ఇంత నీచాతి నీచమా? నా పిల్లల్ని తీసుకుని ఈ క్షణమే మా పుట్టింటికెళ్లి పోతున్నాను. నేనూ నా పిల్లలూ కావాలంటే మీ పద్ధతి మార్చుకుని రండి, ఛీ.... ఛీ....థూ..." అని రాయుణ్ణి దాటి వెలుపలికొచ్చేసింది గిరిజ. ఆమెననుసరించిది పద్మ.

" పదండి స్టేషన్‌కి..... " అన్నాడు ఇన్‌స్పెక్టర్.

ప్రతి కథకూ ముగింపులో పరిష్కారమంటూ ఉండే తీరాలి! కాల్ నాగులను దిసమొలల్తో ఊరిలో ఊరేగించే తీరాలి!!

✦



బాల నేస్తాలు

పత్రాలతో బొమ్మ

మనింటి ముందు రాలి పడిపోతుండే ఎండు టాకులతో కొన్ని కీటకాల బొమ్మలు ఎలా చేయొచ్చో ఇక్కడ ఇచ్చాం! వాటిని గమనించి మీరూ తయారు చేసేయండే!



ఏమిటది?

కొమ్ములుంటాయి కానీ ఎద్దు కాదు. అంబారీ ఉంటుంది కానీ ఏనుగు కాదు ఏమిటది?

కనిపెట్టండి

అగ్గిపుల్లలతో చేసిన ఈ చేపపిల్ల ఈదుకుంటూ ముందుకెళ్లి పోతోంది. కొన్ని అగ్గిపుల్లల్ని కదిలిస్తే ఈ చేప ఈదే దిశ మారుతుంది. అదెలాగో కనిపెట్టండి.



లిటిల్ స్టార్

హాయ్ ఫ్రెండ్స్ నేను బాలీవుడ్ స్టార్‌ని! ఇది నా చిన్ననాటి ఫోటో ఇంతకీ నేనెవరో చెప్పండి?

పదాలు గుర్తించండి

ఇక్కడున్న పూల కుండీలో కొన్ని అక్షరాలు ఉన్నాయి. కింద ఇచ్చిన పదాలు ఆ అక్షరాల్లో ఎక్కడున్నాయో గుర్తించి పెన్‌తో మార్క్ చేయండి.వీలుంటే రంగులు వేయండి.



D	A	D	A	N	D	E	L	I	O	N	D
S	A	E	L	V	D	X	T	T	X	N	I
U	E	F	L	I	R	E	O	U	I	K	A
C	T	S	F	A	L	D	B	L	Y	J	N
O	X	F	O	O	Z	A	S	I	R	I	T
R	E	Q	I	R	D	A	C	P	N	T	H
C	Z	V	H	T	N	I	C	A	Y	H	U
D	A	I	S	Y	G	U	L	U	M	E	S

AZALEA
CROCUS
DAFFODIL
DAISY
DANDELION
DIANTHUS
HYACINTH
IRIS
LILAC
ROSE
TULIP
VIOLET

చుక్కలు కలపండి



ఏ నీడ ఎవరిది

పిల్లలూ! ఇక్కడ కొన్ని జంతువులు వాటి ముందు కొన్ని నీడలు ఉన్నాయి. ఏ జంతువు నీడ ఎక్కడుందో గుర్తించి వాటిని జత చేయండి.



ఎనిమిదేళ్లకే రచయిత్రి

అందరు పిల్లల్లాగే హర్యానాకు చెందిన పదేళ్ల ఇషిత కూడా స్కూల్‌కి వెళుతుంది. ఫుట్‌బాల్ ఆడుతుంది. పుస్తకాలు చదువుతుంది. డ్యాన్స్ కూడా చేస్తుంది. ఇవన్నీ సహజంగా తొమ్మిది, పదేళ్ల వయసున్న పిల్లలు చేసే పనులే కదా అనే సందేహం రాక మానదు. ఈ వయసులో కొందరు పిల్లలు హోమ్‌వర్క్ చేయమంటే తెగపేచీలు పెట్టేస్తుంటారు. ఇప్పుడు కాదు తర్వాత చేస్తామంటూ ఎక్కడలేని బద్ధకాన్నీ ప్రదర్శిస్తారు. ఐతే ఇషిత మాత్రం ఇలాంటి పిల్లలకు భిన్నంగా ఉంటుంది. స్కూల్ వర్క్‌తోపాటు రస్కిన్ బాండ్ పుస్తకాలనీ చదివేసింది. ఎవరైనా పిల్లల్ని నువ్వు పెద్దయ్యాక ఏమవుతావ్? అనడిగితే డాక్టర్, లాయర్, ఇంజనీర్, లేదా పైలట్ అని చెబుతుంటారు. కానీ ఇషిత తాను రచయితనవుతానంది. అనడమే కాదు ఏకంగా ఎనిమిదేళ్ల వయసులోనే 'సిమ్రన్స్ డైరీ' పుస్తకాన్ని రాసి అన్న మాటల్ని నిరూపించి భారత దేశంలో అతిపిన్న వయసున్న రచయితగా ఇషిత రికార్డు నెలకొల్పింది. అంతేకాదు న్యూయార్క్‌లో జరిగిన టెడెక్స్ యూత్ కాన్ఫరెన్స్‌కి ఆహ్వానాన్ని అందుకున్న 400 మంది చిచ్చరపిడుగుల్లో తనూ ఒకరిగా నిలిచింది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరైన ఈ సమావేశంలో పిల్లల హావభావాలపై ఇషిత అనర్గళంగా ప్రసంగించింది. బడికెళ్లే పిల్లల్ని పెద్దలు తమకు నచ్చినట్టు కాకుండా, పిల్లలకు ఇష్టమైన రంగాల్లో ఎదిగేలా ప్రోత్సహించాలనే తన అభిప్రాయాన్నీ అందరితో పంచుకుంది. చదువుకోలేని నిస్సహాయులకి చదువు చెబుతూ వారికి తన పూర్తి సాయాన్ని అందిస్తోంది. ఇన్ని గొప్ప లక్షణాలున్న ఇషితకి సిమ్రన్స్ డైరీ పుస్తకాన్ని రాయడం కంటే తన హోమ్‌వర్క్ చేసుకోడానికే ఎక్కువగా టైమ్ మ్యానేజ్ చేసుకోవాల్సి వచ్చింది! అందుకోసం రాత్రిపూట తన పుస్తకాన్ని రాస్తూ ఉదయం ఐదింటికే లేచి తన హోమ్ వర్క్ చేసేదట.

తేడాలు గుర్తించండి

ఈ చిత్రంలో పది తేడాలు ఉన్నాయి. వాటిని గుర్తించి, సున్నా చుట్టేయండి?





పద వికాసం - 7

కూర్పు: టి.డి. ప్రసాద్

1	2	3		●	4	5		6	●
7			●	8			●	9	
10		●	11	●	12		●		●
	●	13	●	14		●	15	●	16
●	17	●	18		●	19		20	
21	●	22				●	23		●
●	24	●	25		●	26	●	27	28
29		30		●	31		32	●	
33			●	34		●		●	
35		●	36		●	37	●	38	●

ఆధారాలు

అడ్డం

1. ఏపీలో స్మార్ట్ సిటీగా ఎంపికై ఆ తర్వాత తొలగించిన పట్టణం (4)
4. మొదలు, ఆరంభం (4)
7. కనికరం (3)
8. సహాయ సహకారములు 1,3,7 (3)
9. వర్ణం, కాంతి (2)
10. వర్మ దర్శకత్వంలో వచ్చిన డబ్బు సినిమా (2)
11. విక్టరీ సింబల్ అతడిది (1)
12. బండి లాగేందుకు పశువుల మెడలపై వేసే కొయ్య (2)
13. జయజయధ్వానాలే.. తొలుత(1)
14. మంచి కానిది (2)
17. 'అపజయ'.. చివరి అంకం (1)
18. నాకు కాదు -- (2)
19. ---- చాపేగతి అని హాస్యోక్తిగా అంటారు (4)
21. మాయగాడే మరి.. మొదట్నుంచి (1)
22. ఇంటర్వ్యూ (4)
23. పొడికి వ్యతిరేకం (2)
25. ఆంగ్లంలో కోతి (2)
27. వాసన ద్రవ్యం, 48 గజాలు (2)
29. మన యువరాజ్ కాదు 1,3,5,7 (4)
31. తిరగబడిన చేతిరాత (3)
33. మంచి మాటలు (3)
34. పాడేది (2)
35. రిక్తహస్తాలు.. మొదలు, చివర (2)
36. మధ్యాహ్నం -- మండిపోతుంది (2)
37. 11,13,17,21 కలిపితే విజయమాల్యా (1)

నిలువు

1. కలత, తొట్రుపాటు (4)
2. నిటారు పైకే (3)
3. అర నెల (2)
4. మాయగాడు, కపటి (4)
5. పాములవాడు చేసేమాయ (3)
6. రంగం ముందు - కలిపితే గుర్రం (3)
14. నిప్పు తెప్పించే రాయి (4)
15. మీ తండ్రి నాన్న (3)
16. వానరం (2)
18. నీయజమాని (4)
20. జలుబు (3)
24. చెడు ఎత్తుగడలు (4)
26. దొరను పిలవండి (2)
28. ఆంగ్లంలో రేపు (3)
29. ఒక రకం సన్న బియ్యం పేరు (3)
30. రాలిపోవు (2)
31. తటస్థం చివర్లో లేదు (2)
32. పొలాలు (2)
34. మధ్యలో వ చేర్చితే పావడ (2)
38. టి 20 ప్రపంచకప్ మన దేశంలోనే.. ప్రారంభం (1)

సుడోకు

9			2	3		4		
		7	8		4		1	
2	4	5	6		7			3
8	7		9	2		3		
	9	2	4		3	6	7	
		3		6	8		9	1
5			1		6	8	3	4
	8		3		2	7		
		4		8	9			6

గతవారం జవాబులు

3	5	4	8	6	7	1	2	9
6	7	8	9	2	1	3	5	4
1	9	2	5	3	4	6	7	8
7	3	5	1	4	9	2	8	6
4	1	9	6	8	2	7	3	5
8	2	6	7	5	3	4	9	1
9	6	1	3	7	5	8	4	2
2	8	3	4	9	6	5	1	7
5	4	7	2	1	8	9	6	3

1 గ్ర	2 హ	ణం	●	3 నీ	లి	4 మే	ఘం	●	5 పా
6 హ	రి	●	7 న	ది	●	డ	●	8 మ	నీ
9 ము	త	10 పో	క	●	11 గో	●	12 వి	న	యం
●	13 ము	డి	●	14 రు	●	●	15 మా	వి	●
16 ఈ	●	17 యం	18 తా	●	19 గ	20 గ	నం	●	21 కి
22 ల	23 క్ష	●	24 మ	ర	మ్మ	తు	●	●	డ్నీ
●	25 మ	26 ధు	ర	●	27 త్త	కు	28 త	29 ఎ	●
30 త	●	రు	●	31 వం	●	32 బు	క	బు	33 క
●	34 మ	హి	35 ళా	●	36 క	●	37 రా	క	డ
38 చి	ట్టి	●	39 క	రి	●	40 గా	రు	●	కు

వీధుల్లో యోగా

వియన్నాలో ఉంటోన్న సారా టిచాకు యోగా చేసేందుకు ఇక్కడలా కుటీరం అవసరం లేదు. అక్కడలా స్టుడియో అక్కరే రాదు. మ్యాట్, యోగా ప్యాంట్లు వంటి ఎక్స్ట్రాలు వద్దే వద్దు. ఆమెకు ఎప్పుడు మూడొస్తే అప్పుడు బాడీని బెండ్ చేసేస్తుంది. అది నడి రోడ్డు మీదా, మెట్ల పక్కనా, తోటలోనా, బీచ్ బెంచ్ పైనా అని కాదు ఎనీ ప్లేస్ ఎనీ టైమ్ సింగిల్ హ్యాండ్ మీద బాడీని నిలబెట్టేస్తుంది. 22 ఏళ్ల ఈ రబ్బర్ బొమ్మకు యోగా ఆసనాల్లోని మరో మనిషి అవసరమయ్యేవీ చాలా తేలిక. తన ఫొటోల్ని తానే తీసుకుంటుంది కూడా. ఇన్‌స్టాగ్రామ్‌లో సెలబ్రెటీ ఎలా అవ్వాలా అని ఆలోచిస్తూ ఓ రోజు వీధిలో పచార్లు చేస్తుండగా రీస్టార్ట్ అయ్యేందుకు నడుం వంచి అటూ ఇటూ తిప్పింది. అవునూ ఇలా వీధుల వెంట, దారుల వెంట యోగా చేసుకుంటూ ఫొటోలు అప్‌లోడ్ చేసేస్తే ఎలా ఉంటుందబ్బా అని ఆలోచించింది. 'యోగా ఆఫ్ ద మ్యాట్' అనే పేరుతో మట్టిపై చేతులు ఆనించేసింది. ఓ కెమెరాను, ట్రైపాడ్‌ను వెంటేసుకుని టైమర్‌తో ఫొటోలు దిగేయడం మొదలెట్టింది. అలా అని ఇష్టమొచ్చినట్టు స్టిల్స్ ఇచ్చేయలేదు. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో డిగ్రీ చేస్తున్న సారా పార్ట్ టైమ్‌గా యోగా టీచర్ కూడా. ఫొటోగ్రఫీ అంటే ప్రాణం పెట్టే సారా ఒక్కో చిత్రాన్ని ఒక్కో ప్రాజెక్ట్‌గా తీసుకుంది. స్లొవేకియాకు చెందిన సారా యోగాకు అడిక్ట్ అయ్యి కేవలం నాలుగేళ్లు కూడా కాలేదు. మొదట్లో టెన్నిస్, డ్యాన్స్‌లో ట్రై చేశాక బోర్ కొట్టేసి కొత్తగా యోగా ట్రై చేస్తోంది. తొలుత తల్లి వెళ్లే యోగా స్టుడియోకే వెళ్లేది కానీ 90 నిమిషాలు మ్యాట్ మీద అంటే అదీ బోర్ కొట్టేసింది. ఏదో నిర్బంధంగా కాకుండా ఎపుడు అనిపిస్తే అప్పుడు ఆసనం విరిస్తే పోలా అని క్లాసులు ఎగ్గొట్టేసింది. ఆన్‌లైన్‌లో ఓ యోగా కమ్యూనిటీలో సభ్యులు వివిధ భంగిమల్ని ప్రయత్నిస్తూ అవి కుదరక డబేలున పడిపోవడం మళ్లీ ట్రై చేయడం వంటి ఫొటోల్ని చూసి తెగ నవ్వుకునేది. ఆ తర్వాత సారానే అలాంటి చిత్రాలతో ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ తెరిచేసింది.



33 ఏళ్ళ అనుభవంతో...

క్రాంతికార్

(PhD),MSc (Psychology),MSc (Counseling Psychology),
MSc(App Psy),MA (Child Care), BSc(Psy), BA(Psy),BNat (Naturopathy & Yoga),
DY(Yoga),YCC(Yoga), MBA(HR),MA(PPM), MA(S), MA(PPS),MLM,MA(GT),
MA(Phy), BCom,HDSE & More

COUNSELING PSYCHOLOGIST

నత్తి, భయం, ఏకాగ్రత లేమి, మతిమరుపు
డిప్రెషన్, యాంగ్జయిటీ, ఆందోళన, టెన్షన్,
మానసిక ఒత్తిడి, ప్రేమ సమస్యలు, విద్యార్థుల
సమస్యలు, దాంపత్య-సెక్స్ సమస్యలు

Contact for Corporate Programs
Cell: 98481 90302

www.krantikar.com, www.vidhatha.in

VIP Vidhatha *Institute of Personality Developmnet*

Contact for Corporate Programs
Cell: 98481 90302

33ఏళ్ళ అనుభవంతో **వ్యక్తిత్వ వికాసం**

రియల్ ఎస్టేట్, ఇన్సూరెన్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్‌కు
నెట్‌వర్క్ మార్కెటింగ్ ప్రతినిధులకు షాపింగ్‌మాల్స్,
హాస్పటల్ సిబ్బందికి స్కూల్స్, ఇంజనీరింగ్, మేనేజమెంట్
కాలేజిలకు, ప్రత్యేక శిక్షణ కై సంప్రదించండి

**6,000 పవర్ పాయింట్
ప్రదర్శనలు మా వద్ద రెడిగా కలవు**

డా॥ క్రాంతికార్

(Psychologist , Hypno-Therapist & HRD trainer)
(PhD),MSc(Psychology),MSc(Counseling Psychology), MSc(App Psy),
MA (Child Care),BSc(Psy),BA(Psy),BNat (Naturopathy & Yoga),
DY(Yoga),YCC(Yoga),MBA(HR),MA(PPM), MA(S), MA(PPS),
MLM,MA(GT), MA(Phy), BCom,HDSE & More
ప్రముఖ సైకాలజిస్ట్

websites : www.krantikar.blogspot.in
www.vidhatha.in, www.kranthikar.com
www,facebook.com/krantikar ye
Hyderabad : 93 93 11 2021, Vizag :9440 633 610

Check List

Book Number	KNSR02B113	Date	03/09/22
Front Cover	Yes	Back Cover	Yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mouni	Cutting By	Mouni
Scanned By	Sameera	Pages	29